హనీబీఎపి

సంపుటి 1,  సంచిక 4

సెప్టెంబర్-అక్టోబర్ 2011    వెల : ₹ 25/-

# పల్లెసృజన


గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

## మొక్కజొన్నలు విత్తే యంత్రం

## గ్రామీణ ఇన్నోవేటర్ గురవయ్య సృష్టి



# న్యాయశోధన దిశగా!



మిళనాడుకు చెందిన చోళవంశ రాజు ఒకడు తన పాలనలో ప్రజలకి సమానత్వం, సాంఘిక న్యాయం అందించటంలో ఎంతో పేరు గడించాడు. ఆయన తన రాజప్రాసాదం ముందు ఒక పెద్ద గంటను ఏర్పాటు చేశాడు. ఎవరికైనా అన్యాయం జరిగితే న్యాయం ప్రసాదించమని ఆ గంటను కొడితే చాలు. రాజుగారు వారికి జరిగేటట్లు చూసేవారు. కానీ, ఆ గంటను ఇంకేమార్గమూ లేదనుకున్న తర్వాతే కొట్టాలని అందరికీ తెలుసు. ఒకరోజు గంట మ్రోగింది. అందరూ కుతూహలంగా వెళ్ళి చూడగా, ఒక ఆవు తన నోటితో తాడు పట్టుకుని లాగుతూ గంట కొట్టటం చూసి అంతా ఆశ్చర్యపోయారు. ఒక విచిత్రమైన ఫిర్యాదు వచ్చిందని రాజుకు కబురందింది. ఆయన త్వరగా వచ్చి చూసి ఆశ్చర్య చకితుడయ్యాడు. అక్కడ గుమికూడిన వారిమధ్యనుండి తోవ చేసుకుంటూ వెళ్ళి ఆవుదగ్గర నిలుచున్నాడు. ఆవు రాజుగారిని చూసి ఆయనవద్దకి వచ్చి నడక ప్రారంభించింది. రాజుగారు దాని వెనకే వెళ్లారు. గోవు రాజుని ఒక ఎద్దు చనిపోయి పడివున్న చోటుకు తీసుకువెళ్లింది. ఎద్దుని ఢీకొట్టి చంపేసిన రథం అక్కడ ఆగివుంది. అది రాజుగారి కుమారులదే. రాజుకు వెంటనే విషయమంతా బోధపడింది. ఆయన తన కుమారుని కింద పడుకోమని అదే రథాన్ని అతనిమీదుగా పోనివ్వమన్నాడు. రథం తనమీదనుంచి వెళ్ళటంతో రాకుమారుడు చనిపోయాడు. గోవుకి న్యాయం జరిగింది.

కేవలం మానవులకే కాదు పశువులకి కూడా జరిగిన న్యాయం కథ. దానికి విరుద్ధంగా ఈరోజున్న పరిస్థితులను గమనించండి ఒకసారి. ఈరోజుల్లో పేదవారికి, అవకాశాలు లేనివారికి న్యాయం జరుగుతోందా? వారి హక్కులని గౌరవించటం అన్నది మనం ఏ విధంగా పునరుద్ధరించగలం? ఒక్కసారి ఆలోచించండి.

-హనీబీ - 4(2 & 3) 1993

# పల్లెసృజన

సంపుటి-1 సంచిక - 4 సెప్టెంబర్-అక్టోబర్ 2011



## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగులగణేశం**

సంపాదకులు :
**జె. శశిమోహన్**

సలహాదారులు :
**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 040- 32945655
సెల్ : 93913 75655, 800 888 5655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555, 98660 01678
E-mail : honeybeeap@gmail.com
www.pallesrujana.org


## ఈ సంచికలో...


- సామాన్య ప్రజల జ్ఞానానికి విలువనిద్దాం ! - 3
- నీటిపై తేలియాడే పంప్‌సెట్ - 6
- ప్రత్తి విత్తనాలను నారు పోసి నాటిన ఆదర్శ రైతు - 7
- తిరుపాలయ్య ప్రయోగాలు - 8
- కట్టా రామకృష్ణ సరికొత్త వ్యవసాయం - 9
- విశాఖపట్నం జిల్లా సాంప్రదాయ జ్ఞానం - 11
- తడి ఆరని పొలాల్లో సులువుగా మొక్కజొన్నలు విత్తే యంత్రం గ్రామీణ ఇన్నోవేటర్ గురవయ్య సృష్టి - 12
- ఆసు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం - 18
- ఇతర రాష్ట్రాల ఇన్నోవేషన్లు - 20
- ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 26
- 'హనీబీఏపి' ప్రగతి - 29
- ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 30
- స్పందన - 32


**కవర్ చివరి పేజ, లోపలి పేజీల్లో ....**


న్యాయశోధన దిశగా !   ఎన్.ఐ.ఎఫ్. ఉద్దేశ్యాలు


**మధ్య పేజీలో....**


మన మల్లేశానికి జాతీయ స్థాయిలో 'శాంసంగ్' వారి బహుమతి



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : **Brig. P. Ganesham,** 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 32945655

# సంపాదకీయం

జ్ఞానం భగవంతుని వరం. జ్ఞానమంతా (ఆధ్యాత్మిక జ్ఞానం తప్పిస్తే) ప్రకృతిలో నిమిడి ఉంది. మనం ఆ జ్ఞానాన్ని రోజూ చూస్తూవుంటాం కాని అంతా గుర్తించలేం. జ్ఞానవేత్తలు మన చుట్టూవున్న సృష్టిలోని జ్ఞానాన్ని క్రోడీకరించి ప్రజ్ఞావేత్తలచే పరీక్షింపబడి ప్రామాణికం చేయబడిన తర్వాత అది విజ్ఞానం (సైన్సు) అవుతుంది. ఈ వాదాన్ని ఒక్కనిమిషం అంగీకరించామనుకొంటే ఇంతవరకు సృష్టిలోని ఎంత జ్ఞానాన్ని మనం సైన్సు'గా మార్చగలిగామంటారు? సైన్సు మనకో తెలిసిన నమ్మిన జ్ఞానమైంతే, ప్రామాణికం చేయని జ్ఞానం ఎవరికి తెలుసు? ఎవరు దాన్ని ఉపయోగించుకుంటున్నారు? మనం ఎంత వేగంగా సైన్సును జ్ఞాన అంచులకి చేర్చగలము? ఇప్పుడు అవలంబించే "జ్ఞానం నుండి సైన్సు" పద్ధతి సబబుగానే ఉందా? ప్రస్తుత పద్ధతిలో ఏమైనా మార్పులు కావాలా?

గ్రామవాసులు, ఆదివాసులు, ప్రకృతితో తమ జీవనాన్ని ముడిపెట్టుకున్న వారంతా బహుశా సైన్సుకాని జ్ఞాన పరిధిలో ఉన్నారేమో? వారికున్న ప్రకృతితో సమన్వయం, అవగాహన, స్నేహశీలత అనూహ్యం. తరతరాలుగా వారు మనగలుగుతున్నారంటే  దానికి కారణం వారికి ప్రకృతిలో వున్న ఈ అపురూప బాంధవ్యం. వారు ప్రకృతిలో ఒకరిగా ఉంటారు. ప్రకృతిలోని వనరులను పొదుపుగా వాడుకుంటున్నారు. అంటే ఎండిన కొమ్మలు, పూలు, ఫలాలు, దుంపలు, ఆకులు మొదలైనవి మాత్రమే. అందుకే వారు ప్రకృతిని కబళించే ప్రయత్నంలో ఉండరు. ప్రకృతిని నియంత్రణ కూడా చేయరు. వారి జీవన ఆధారాన్ని క్రమక్రమంగా శూన్యం చేయకూడదన్న సత్యం వారికి తెలుసు. కాని 'అభివృద్ధి' 'ధనార్జన' పేరుతో ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు ఈ ప్రకృతి మిత్రులను ప్రలోభించి వారి వనరులను, జీవనాధారాన్ని కొల్లగొడుతున్నారు. దాంతో గ్రామవాసులు పేదవాళ్ళవుతున్నారు. చదువుకొన్నవారు (జ్ఞానులమని చెప్పుకునే స్వార్థపరులు) ధనవంతులవుతున్నారు. "బంగారు గుడ్లు పెట్టే బాతు" కథలా తయారు చేశారు గ్రామ ప్రజల పరిస్థితి.

అభివృద్ధి అంటే గ్రామవాసులకున్న స్థోమతలను పెంచాలి. వారికి సరియైన సాంకేతిక జ్ఞానాన్ని ఇవ్వాలి. గ్రామాల సుస్థిరత, గ్రామవాసుల ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థోమత, కలసివుండే జీవన విధానాలు అభివృద్ధి పథంలో ఉండేట్టు చూడాలి. ప్రస్తుతం అభివృద్ధి ప్రణాళికలన్నీ గ్రామాల్లో లేని వాటిపై కేంద్రీకరిస్తున్నాయి. వారికి తెలియనివి, వారు సులభంగా నేర్చుకోలేని టెక్నాలజీపై మొగ్గు చూపెడుతున్నాయి. అందుకే గత ఆరు దశాబ్దాల ప్రజాస్వామ్య భారత స్వావలంబన చరిత్రలో గ్రామాల అభివృద్ధి అంతంత మాత్రమే కదా!

గ్రామవాసుల జ్ఞాన సంపదను, వారి సాంకేతిక అవసరాలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, వీటి ఆధారంగా ఆ గ్రామాలు అభివృద్ధికై వనరుల పంపిణీలు చేయాలి. అధికారులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు గ్రామాలు విరివిగా తిరగాలి. చెప్పడం కాకుండా వినడం నేర్చుకోవాలి. గ్రామవాసుల సామర్థ్యాలు, వారి జ్ఞాన సంపద, వారి అవసరాలు క్షుణ్ణంగా అర్థం చేసుకొని వాటిని అభివృద్ధి ప్రణాళికల్లో పూర్తిగా నిమగ్నం చేయాలి. అట్టడుగు స్థాయి నుండి ఈ ప్రణాళికలు తయారు కావాలి. అప్పుడే మన గ్రామాలు సుస్థిరత్వాన్ని సాధించగలవు.

యువతను ప్రకృతినుండి దూరం చేసి, ఆధునికతను, అప్రాకృతికతను జీవితంలో ప్రాధాన్యం చేయడం మనం పశ్చిమ దేశాలనుండి నేర్చుకొన్నాం. ఈ మోడల్ వైవిధ్యభరితమైన మన దేశానికి సబబేనా అన్నది ఒక మహా ప్రశ్న. గత 60 సంవత్సరాల రికార్డు ఈ ప్రశ్నకు 'కాదు' అని జవాబిస్తుంది. మరి ప్రత్యామ్నాయం ఏమిటి?

సంప్రదాయ జ్ఞానం, ప్రాకృతిక సమన్వయం, సబబైన సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడిన అభివృద్ధి పథంలో మన సమాజాన్ని నడిపించాలన్నదే మా ధ్యేయం.

మీ సలహాలు, విమర్శలను ఆహ్వానిస్తున్నాము.

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

# సామాన్య ప్రజల జ్ఞానానికి విలువనిద్దాం !

– ప్రొ. అనిల్ గుప్త, "హనీబీ" ఆంగ్ల పత్రిక సౌజన్యంతో.

ఈమధ్యకాలంలో మీడియా, కార్పోరేషన్లు, ప్రజా సంస్థలు కూడా వీధిలో వుండే సామాన్య జనుల ఆలోచనల నుండి నేర్చుకోవాలన్న ప్రయత్నాలు ఎక్కువగా చేస్తున్నారు. అయితే ఈ ప్రయత్నాలు వివిధ దేశాలలో, ప్రాంతాలలో, రంగాలలో సమానంగా లేవని మాత్రం చెప్పుకోవచ్చు. ఈ విధంగా ఎవరివద్దనుంచైనా ఆలోచనలను గ్రహించవచ్చు నన్న ఆలోచన పబ్లిక్, ప్రైవేటు రంగాల పరిశోధనా వేత్తలది. మనం పరిశోధనా అభివృద్ధికై ఏర్పాటు చేసుకున్న సంస్థలు వారి పరిమితిని మించి కొత్తదాన్ని సృష్టించలేక పోతున్నారు అన్న నిజాన్ని ఈ ఆలోచన వెల్లడి చేస్తోంది. అంతకన్నా ముఖ్యమైనది, సంతోషించదగ్గది ఏమిటంటే హనీబీ గత రెండు దశాబ్దాల నుంచి అవిశ్రాంతంగా పాటు పడుతున్నప్పటికీ సామాన్య ప్రజల జ్ఞానం ఇంతవరకు సామాజిక చింతన, వివేకవంతుల మాటల మధ్యే కొట్టుమిట్టులాడుతున్నది. సమాజం ఇప్పుడిప్పుడు సామాన్య ప్రజల ఆలోచనలు, ఇన్నోవేషన్లపై దృష్టి పెడుతున్నది.

సర్వత్రా హర్షణీయమైన ఈ మార్పుకు కారణం ఏమిటా అని ఆలోచిద్దాం. మేము అట్టడుగు స్థాయి ఇన్నోవేటర్ల నుంచి సాంప్రదాయం జ్ఞానం ఉన్నవారి వద్దనుండి 1980 నుండి సాధారణంగా, 1984 నుండి తీవ్రంగా వివరాలు తెలుసుకోవటం మొదలు పెట్టినపుడు దేశంలో హరిత విప్లవం పూర్తయి దాని లాభాలను ప్రజలు అధికోత్పత్తి ద్వారా పొందుతున్నారు. ఆ కాలంలో 'ల్యాబ్ టు ల్యాండ్' (పరిశోధనల నుండి క్షేత్ర స్థాయికి) మరియు పరిశోధనా అభివృద్ధి సంస్థలు, కార్పోరేషన్లు, ప్రజా సంస్థలు ఈ మార్పులో కీలక పాత్రను పోషించాయి. తర్వాత దాదాపు ఒక దశాబ్దం వరకు ఈ విధంగానే కొనసాగింది. ఆ తర్వాత దశాబ్దం నుండి అట్టడుగు స్థాయి లేదా వినియోగదారులకు కావలసిన ఇన్నోవేషన్లు వెలుగు చూడటం ప్రారంభించాయి.

ఇది బహుశా పశ్చిమ దేశాలలోని చాలా ఔషధ కంపెనీలు కొత్త మందులు కనిపెట్టడంలో వెనకపడ్డందుకు అయివుండవచ్చు. లేదా ఇంతకు ముందున్న మందుల పేటెంట్ హక్కుల కాల పరిమితి ముగిసి వుండవచ్చు. దీంతోపాటు పెద్ద ఇంజనీరింగ్ కంపెనీల పరిశోధనా అభివృద్ధి విభాగాలు కూడా వెనుకబడ్డాయి. ఈ దశలో ప్రజలు కూడా పరిశోధనా అభివృద్ధి సంస్థలు మామూలు ఇన్నోవేషన్లతో సమానం కాదని గ్రహించారు. వారు జాతీయ ఇన్నోవేషన్ ప్రక్రియలో భాగమైన కేవలం పుస్తకాలకే పరిమితమైన కార్పోరేట్ (పబ్లిక్, ప్రైవేటు కూడా)ల పరిశోధనా అభివృద్ధి లేదా ఇతర పరిశోధనా అభివృద్ధి సంస్థలను ప్రశ్నించటం మొదలు పెట్టారు !. అప్పటినుండి ప్రజలనుండి, సంస్థల నుండి లేదా ఇతర పద్ధతుల ద్వారా సామాన్య జనుల ఆలోచనలని తెలుసుకోవటానికి ప్రాముఖ్యతనివ్వటం ప్రారంభమైంది. ఇక్కడో ముఖ్యమైన ప్రశ్న ఉత్పన్నమౌతుంది. అకస్మాత్తుగా ప్రపంచం సామాన్య జనుల నుండి ఆలోచనలను గ్రహించాలని ఎందుకు అనుకుంది? అంతవరకు ప్రపంచ ప్రఖ్యాతి పొందిన పెద్దపెద్ద కంపెనీలు, వివేకవంతులు, సామాజిక, మార్కెట్ సమస్యలు తీర్చగలరన్న నమ్మకం ఎందుకు వారిలో సన్నగిల్లిపోయింది?

ప్రజల ఆలోచనా విధానం మారటానికి మరో కారణం కూడా ఉంది – ఆర్థిక శాస్త్రవేత్త 'షంపీటర్' 1934 లో ఇన్నోవేషన్లకి చాలా ప్రాముఖ్య ఇవ్వాలి అని చెప్పకముందే క్రీ.పూ. మొదటి శతాబ్దం, ఆ తర్వాత క్రీ.శ. ఆరో శతాబ్దాలలో చైనా దేశంలో స్థానిక సమస్యలకి స్థానిక పరిష్కారాలు వెతకడం అన్నది ప్రారంభమై మొత్తం ఆసియా సంస్కృతులన్నిటికి విస్తరించింది. భారతదేశంలో కూడా ఆయుర్వేద పద్ధతిలో వ్యవసాయ, పశువుల, మానవులకి సంబంధించిన సమస్యలకి పరిష్కారాలు అనుభవం ద్వారా సేకరించి, క్రోడీకరించి, గ్రంథస్థం చేయబడినాయి.

అయితే ఈ పద్ధతులు నలుగురికీ తెలిసిన జ్ఞానంగా భావించి వీటిపైన తీవ్రమైన పరిశోధనలు, పరీక్షలు చేయలేదు. ఈవిధంగా గ్రంథస్థం చేసిన జ్ఞానం వాడుకగా కొందరివద్దనే ఉండిపోయింది. డా. మషేల్కర్ చెప్పినట్లు

జీవితపు పరిశోధనాశాలల్లో ప్రయోగాలు చేసి, ధృవీకరించిన ఈ పద్ధతులు ఇప్పటికీ ఆచరణలో, అమలులో ప్రతిభావంతంగా పనిచేస్తున్నాయి. అయితే దాదాపు 500 సంవత్సరాల క్రితం ఐరోపాలో ఒక క్రమ పద్ధతిలో శాస్త్రీయంగా ఇటువంటి జ్ఞానాన్ని ధృవీకరించే పద్ధతి అమలులోకి వచ్చింది. దానితో శాస్త్రానికి కూడా ఒక నిఘంటువు లాంటిది ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా వున్న శాస్త్రీయ జ్ఞానాన్ని కూడా ఈ నిఘంటువులో పొందుపర్చటం జరుగుతోంది. దీనిలో తూర్పు, పశ్చిమ ప్రాంతపు శాస్త్రీయ తత్వమన్న భేదాలేమీ లేవు. సామాన్యంగా పాలను వేడిచేసి వెంటనే చల్లార్చటం వలన అందులోని బాక్టీరియా నాశనమై ఆ పాలు చాలాకాలం నిలువ వుంటాయన్నది ప్రపంచ వ్యాప్తంగా ఆమోదయోగ్యమైన సత్యం. కాకపోతే మనకున్న ప్రాంతీయ, భాషా భేదాల వలన ఒకరికొకరు అర్థమయ్యేలా చెప్పుకోలేక పోతున్నామంతే. వింత ఏమిటంటే ఈ పద్ధతి పశ్చిమ దేశాల్లో కనిపెట్టబడినా దానికి ఆమోదముద్ర తూర్పు దేశాల్లో మరొక పద్ధతి (ప్యాశ్చరైజేషన్) కనిపెట్టిన తర్వాత ఇవ్వబడింది. అసలివన్నీ కనిపెట్టకముందు నుంచే మన నానమ్మలకి, అమ్మమ్మలకి రెఫ్రిజిరేటర్ లేనప్పటినుంచి కూడా పాలని తరచూ వేడిచేస్తూ ఎలా నిల్వ ఉంచాలి అన్నది తెలుసు. అలాగే ధాన్యాలని ఎండలో పెట్టి నిల్వ ఉంచేవాళ్ళు కదా ఎంతసేపు ఎన్నిసార్లు, ఎంత ఎండలో పెట్టాలన్నది అలా చేస్తే ఎంతకాలం నిల్వ వుంటాయన్నదికూడా వారికి తెలుసు.

**టెక్నాలజీ శాస్త్రంకన్నా ముందు పుట్టింది :**

మనకి శాస్త్రం పుట్టకముందు నుంచే టెక్నాలజీ అమలులో వున్న సందర్భాలు అనేకం వున్నాయి. భవన నిర్మాణశాస్త్రం పుట్టకముందు నుంచే మనకి ఇల్లు ఎలా కట్టుకోవాలో తెలుసు, కట్టుకుంటున్నాం కూడా. మైక్రో బయాలజీ శాస్త్రం ఆవిర్భవించకముందునుంచి కూడా మనం ఊరగాయలు పెట్టుకోవటం, ఆహార పదార్థాలు ఏ విధంగా ఎక్కువ కాలం నిలువ వుంచుకోవచ్చునన్న పద్ధతులు తెలుసు. ఈ విధంగానే ప్రపంచంలో ఎంతోమంది విజ్ఞులు ఇంకెన్నో విషయాలు శాస్త్రరీత్యా ఋజువు కాకముందునుంచే అమలు పరుస్తూనే వున్నాం. కానీ, వ్యాపారపరంగా ఆ జ్ఞానాన్ని వాడుకోలేదు, అవసరమనిపించలేదు. కారణం – ఆ జ్ఞానం అందరికీ తెలుసు, అందరికీ అందుబాటులో వుండేది. దీనిని ఎవరూ రహస్యంగా వుంచుకోలేరు. ఎవరైనా దీనిని ఉపయోగించ వచ్చు లేదా అభివృద్ధి చేసుకోవచ్చు అని వదిలేశాం.

**జ్ఞానాన్ని వర్గీకరించటం :**

ఇక్కడో విషయం చెప్పుకోవాల్సి వుంది – జ్ఞానాన్ని సేకరించటం, దానిని వ్యాపింపజేయటం, కనీసం ఉందని గ్రహించటం, దానిని నలుగురికీ తెలియజేయటం అన్నది మన తూర్పు దేశాలలో మాదిరే పశ్చిమ దేశాలలో కూడా సమస్యగానే వున్నది. ఒక నిమ్న జాతికి చెందిన వ్యక్తి, ఒక చర్మకారుడు లేదా ఒక మహిళ లేదా ఒక గిరిజన జాతికి చెందిన వ్యక్తి ఏదైనా కనిపెడితే దానిని గుర్తించటం లేదా శాస్త్రీయంగా ధృవీకరించటానికి చాలా సమయం పడుతుంది. దానివలన అందరూ లాభపడుతున్నారు కానీ, కనిపెట్టిన అతనికి మాత్రం తగిన గౌరవం, గుర్తింపు, ఫలితాలు అందటం లేదు. 'ఆటం స్టాన్లీ' తన (ఎక్కువగా ఎవరూ చదవని) 'మదర్స్ & డాక్టర్స్ ఆఫ్ ఇన్నోవేషన్ అనే పుస్తకంలో అమెరికాలో గత 200 సంవత్సరాలుగా పొందిన పేటెంట్ల గురించి అధ్యాయనం చేసి 20వ శతాబ్దంలో 8వ దశకంలో పేటెంట్ పొందిన మహిళల సంఖ్య కేవలం 2 శాతమని, ఆ దశకం చివరి భాగంలో అది కొద్దిగా మెరుగై 8 శాతానికి చేరిందని చెప్పింది. భారతదేశంలో కూడా దాదాపు ఇదే పరిస్థితి ప్రత్యేకించి నిమ్న జాతులు, మహిళలలో వున్నది. మహిళలు, తక్కువ జాతివారిని కొన్ని మతసంబంధమైన గ్రంథాలకి దూరంగా వుంచే ప్రయత్నం చేయబడింది. మన దేశంలో మహిళా ఓటు హక్కు ప్రారంభించిన చాలా సంవత్సరాల తర్వాత స్విట్జర్లాండులో మహిళలకి 1960 తర్వాతనే ఓటుహక్కు కల్పించబడింది అని ఇక్కడ గమనించాలి.

**స్వేచ్ఛా పద్ధతిలో ఎంత స్వేచ్ఛ ఉండాలి? :**

జ్ఞానాన్ని స్వేచ్ఛగా వదిలేయాలి అన్న పద్ధతి అంటే మన సంస్థలు, సంస్కృతి, నైపుణ్యం, టెక్నాలజీలని పూర్తిగా స్వేచ్ఛగా వదిలేయాలని కాదు. మన భారత సంస్కృతిలో మహిళలు పొలం దున్నటం, కమ్మరి, వడ్రంగం లాంటి పనులు చేయటం (దాదాపు) అన్నది లేదు. వీటికి

సంబంధించిన సమస్యలకి పరిష్కారాలు వారివద్ద వున్నప్పటికీ వారిని పూర్తిగా అమలు చేయలేదు. కానీ, తరతరాలుగా మహిళలు పిల్లల సంరక్షణ, ఆహార నిల్వ, పెరటి తోటలు, అల్లికలు, నేతపని మొదలైన వాటికి సంబంధించిన జ్ఞానం దాపరికం లేకుండా అందరూ స్వేచ్ఛగా వాడుకునే పద్ధతి అమలులో వుంది. కానీ విచారించదగ్గ విషయం ఏమిటంటే కొన్ని మంచి ఆలోచనలు అందరికీ పనికి వచ్చేవి అయినప్పటికీ వాటి విషయాలలో అనవసరపు కట్టుబాట్లు అమలులోకి వచ్చాయి. జ్ఞానాన్ని స్వేచ్ఛగా అందరికీ చెందేలా చూడాలి అన్నదానికి ఈ విధమైన కట్టుబాట్లు ఆటంకంగా వున్నా, వాటిని పూర్తిగా తొలగించటం అన్నది మాత్రం ఈ పద్ధతి వలన సాధ్యం కాకపోవచ్చు. ఉదాహరణకి సమాజంలోని కొందరు ఆర్థికంగా పటిష్టంగా వున్న మహిళలు శిశువు పుట్టినరోజు మొదటి రెండు గంటలు తల్లి తన పాలను తాగించకూడదు అన్న కట్టుబాటు జ్ఞానాన్ని స్వేచ్ఛగా పంచినంత మాత్రాన తీసివేయగలమా?

**ప్రజల జ్ఞానాన్ని అందుబాటులోకి తేవటం :**

ఇంత చెప్పిన తర్వాత కూడా జ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా చేయటం ద్వారా మానవుల మనుగడకి ఖచ్చితమైన ధృవీకరించబడిన జ్ఞానం బాగా తోడ్పడుతుంది అన్నదానికి కొన్ని పరిమితులున్నాయి. అయినా అట్టడుగు స్థాయి జ్ఞానాన్ని నలుగురికీ అందుబాటులో వుంచాలన్న ప్రక్రియ ఏ పేరుతో పిలిచినప్పటికీ చాలా ప్రాచుర్యం పొందుతూనే వుంది. గొప్పవాళ్ళు, పలుకుబడి గలవాళ్ళది అని పేరున్న 'ఫోర్బ్స్' పత్రిక ఉప సంపాదకుడు తమ జనవరి 2011 సంచికలో ప్రజల కల్పనల గురించి రాయాలని నిర్ణయించుకొని హనీబీని సంప్రదించటం జరిగింది. ఆ సంచికలో వారు శ్రీ సైదుల్లా రూపకల్పన చేసిన 'నీటిలో కూడా తేలుతూ నడిచే సైకిల్'ను ఉదాహరణగా చెపుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి ఆలోచనలు, ఇన్నోవేషన్లు ప్రజలకి ఏవిధంగా సహాయం అందించగలవని వివరించారు. (ఆ సమయంలో పాకిస్తాన్‌లో వరద వచ్చినప్పుడు ఇటువంటి సైకిల్‌పైన సహాయం చేరవేయటం జరిగింది). ఆ పత్రికవారు ఈ పని చేయటం ద్వారా పత్రికా రచనలో కొత్త ఒరవడి సృష్టించి, తమ పత్రిక ముఖచిత్రంగా, లోపల కూడా ఎటువంటి బొమ్మ వేస్తే బావుంటుందని సలహా అడిగారు. దానికి వేల సంఖ్యలో అభిప్రాయాలు, సలహాలు వచ్చాయి. చాలా పెద్ద పెద్ద కార్పోరేషన్ల అధిపతులు భవిష్యత్తులో తమ వస్తువులు కంపెనీలోని వారు కాక, బయటివారు రూపొందించినవై వుంటాయి అని ప్రకటించారు. భారతదేశానికి చెందిన ఒక కంపెనీ తాము తయారు చేసే తినుబండారాల ప్యాకెట్ పైన దానిని తయారు చేసే పద్ధతిని సూచించిన వ్యక్తి కుటుంబపు ఫోటోను ముద్రించారు కూడా. (ఇది వారి మార్కెట్ పెంచుకోవటానికి ఉపయోగించిన చిట్కా కూడా అయి వుండవచ్చు).

కాకపోతే ఇటువంటి ఉదాహరణలు భారతదేశంలో చాలా తక్కువగా వున్నా ఫలితాలు మాత్రం సుస్పష్టంగా ఉన్నాయి. సంవత్సరాల క్రితం హనీబీ ఏదైతే ప్రారంభించిందో దానికిప్పుడు ప్రాముఖ్యత వస్తోంది. మేము జాతీయ, అంతర్జాతీయ సైన్స్ & టెక్నాలజీ సంస్థలని ప్రభావితం చేసే ప్రయత్నం చేసి, కొద్దిపాటి ఫలితాలు సాధించాం. కానీ, ఇంకా చేయాల్సింది చాలా వుంది. ప్రజలనుంచి ఇన్నోవేషన్ సేకరించే పద్ధతి మాత్రం ఈ విధంగానే వుంటుంది. ఈ జ్ఞాన సేకరణ అన్నది చాలా కష్టంతో కూడుకున్న ప్రక్రియ కనుక ఏ ఒక్క సంస్థ వీటి సమస్యలకి పరిష్కారం కనుగొనలేదు. ఎవరు చేసినా జ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేసే పద్ధతి కావాలి. ఎవరి జ్ఞానమైనా అతడికి గుర్తింపు లేకుండా ఫలితం దక్కకుండా ఎవరూ వాడకూడదు అన్నదే మా ప్రయత్నం. కానీ, సంస్థాపరమైన, భాషాపరమైన, టెక్నాలజీకి సంబంధించిన సమస్యలు ప్రజల మధ్య జ్ఞానాన్ని స్వేచ్ఛగా ఒకరివద్దనుండి ఇంకొకరికి చేర్చటానికి అడ్డంకులుగా వున్నాయి. వాటిని భారీయెత్తున అధిగమించాల్సి వుంటుంది. నెట్‌వర్క్ సదుపాయంతో దీనిని అందరికీ అందుబాటులో వుండే ప్రయత్నం చేసినా, గిరిజనులకి, పొలాల్లో పనిచేసుకునే వారికి, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ లాంటి సదుపాయాలు లేనివారికి ఇవి చేరటం లేదు. వారికి కూడా సులభంగా, చౌకగా సేకరించిన జ్ఞానాన్ని అందించే పద్ధతి ఏదైనా

### అన్ని ఋతువుల్లోనూ అనుకూలంగా ఉండే

# నీటిపై తేలియాడే పంప్‌సెట్

– 'ద హిందూ' ఆంగ్ల దినపత్రిక (ఆగస్ట్ 4, 2011) సౌజన్యంతో....

వర్షాలు బాగా పడుతున్న కాలంలో ద్విచక్ర వాహన దారులు స్పార్క్ ప్లగ్‌లు బాగు చేయించుకోవటానికి లైన్లు కట్టడం సాధారణంగా చూస్తూ వుంటాం. అదేవిధంగా పల్లెల్లో నీరు చేరటం వల్ల చెడిపోయిన పంపు సెట్ల కాయిల్స్ బాగు చేయించుకోవటానికి రిపేరు షాపుల వద్ద బారులు తీరటం కూడా సహజమే. ఇటువంటి రైతులకి నీటిపై తేలియాడే పంపుసెట్టు ఉందని తెలిస్తే ఈ చిన్ని సమస్య నుండి తేలికగా విముక్తి పొందవచ్చు అంటున్నారు చెన్నయ్ లోని 'పోలిన్ ఫిలిం ఇండస్ట్రీస్' కి చెందిన పార్థసారథి.

ఈ సంస్థ రూపొందించిన నీటి ఉపరితలంపై తేలియాడే పంప్‌సెట్‌కి ఎల్– ఆర్.ఎ.ఎం.పి.– 2007 లో గ్రాస్‌రూట్ స్థాయిలో ఉత్తమ ఇన్నోవేషన్ బహుమతి కూడా వచ్చింది. బావులలో వేరు వేరు కాలాలలో పంపుసెట్లను వేర్వేరు స్థానాల్లో బిగించే సమస్యను ఈ ఇన్నోవేషన్ ద్వారా అధిగమించవచ్చు అంటున్నారాయన. రైతులు సాధారణంగా పంపుసెట్‌ని నీటి స్థాయిని బట్టి పైకి లేదా కిందకు మారుస్తూ వుండాల్సి వస్తుంది. ఎండాకాలంలో నీటి స్థాయి క్రిందకి దిగిపోయినప్పుడు రైతు పంపుసెట్‌ను కూడా కిందకి దించి నీటి ఎత్తుకు తగిన స్థాయిలో బిగించుకోవాల్సి వస్తుంది. అదే విధంగా నీరు పరిమాణం పెరుగుతుంది కాబట్టి పంపుసెట్‌ను పైకి లేపి నీటిలో తడవకుండా బిగించుకోవలసి వుంటుంది.

నీటిలో తేలే రెండు 'ఫ్లోట్స్' (గాలి బుడగల్లాంటివి) పై అమర్చిన చెక్క పలకపై మధ్యలో పంపుని, దానితో పాటు సెల్ఫ్ ప్రైమింగ్ ఛాంబర్‌ను ఏర్పాటు చస్తారు. దానివలన పొడుగాటి సెక్షన్ పంపు, సేఫ్టీ వాల్వ్ ఉండవు కనుక దాదాపు 30 శాతం శక్తి ఆదా అవుతుంది. వర్షాకాలంలో బావిలో నీరు పైకి వచ్చినప్పుడు ఈ ఫ్లోట్‌లు నీటిపై తేలితాయి కనుక పంపును తీసుకునే అవే పైకి వస్తాయని వివరించారాయన.

ఈ ఇన్నోవేషన్ వలన చిన్న నీటిపారుదల రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయి. ప్రత్యేకించి వ్యవసాయ రంగంలోని రైతులు తమ పంపుసెట్‌లు కాలిపోకుండా కాపాడుకోవటానికి ఇది చాలా అనువుగా వుంటుంది. పొలాల్లో వుండే బావులలోని పంపుసెట్లకి మాటి మాటికీ వైర్లు మార్చనవసరం లేదు. సాధారణంగా పొలాల్లోని బావుల్లో కాలాన్ని బట్టి నీటి స్థాయి మారుతున్నప్పుడు పంపులని కూడా మార్చటానికి వైరింగ్‌కు చాలా ఖర్చు చేయాల్సి వుంటుంది. చాలా సమయం కూడా పడుతుంది. ఇప్పుడా బాధ ఉండదు. వర్షాకాలంలో చాలాసార్లు బావిలోని నీరు అకస్మాత్తుగా పెరిగినప్పుడు పంపుసెట్లు నీటిలో మునిగిపోయి పాడైపోతాయి. ఇప్పుడా ఇబ్బంది ఉండదు. నీటిపైబాగా అమర్చిన పంపుసెట్ల నుంచి నీరు బైటకి లాగటానికి ఏర్పాటు చేసిన పైపులు సాధారణంగా చాలా పొడవుగా వుంటాయి. నీటి స్థాయి కిందకి పడిపోయినప్పుడు, పైపులకి నీరు అందనప్పుడు మోటార్లు నీరు లేకుండా పనిచేయటం వలన కాలిపోతాయి. ప్రతి పంపుసెట్‌కి వర్షం నుండి, ఎండ నుంచి రక్షణ కల్పించటానికి ఒక ప్రత్యేకమైన షెడ్‌ను నిర్మించాల్సి



వుంటుంది. ఈ తేలియాడే పంపుసెట్ వాడటం వలన అటువంటి ఇబ్బందులేమీ ఉండవు. దీనిలో పాలిథిన్ సాంద్రత ఎక్కువగా ఉండి, ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్లోట్‌ల పైన ఇనుప జాలి కట్టి, దానిపై ఒక చెక్క పలకపై సెల్ఫ్ ప్రైమింగ్ ఛాంబర్ ఏర్పాటు చేస్తారు. ఈ మొత్తం ఏర్పాటుకు పంపుసెట్‌తో సహా ఒక ప్లాస్టిక్ తాడుతో ఒక స్టీల్ ఫ్రేంకి కడతారు. 4 కోర్ కరెంటు వైర్ కూడా ఈ తాడుతో కట్టి సరియైన అర్తింగ్ ఉండేలా ఏర్పాటు చేస్తారు. ఒక కదిలే పుల్లీ ద్వారా పంపుసెట్ నీటిపై స్థిరంగా తేలే ఏర్పాటు చేస్తారు. దీనికి ఫుట్‌వాల్వ్ లేకుండా ఒక రిజిడ్ పి.వి.సి. సెల్ఫ్ ప్రైమింగ్ ఛాంబర్‌తో అనుసంధానించి దానికి మరోవైపుకు నీటిలోకి బ్లో మాడ్యూల్డ్ ఫిల్టర్ బాస్కెట్ ఏర్పాటు చేస్తారు. ఒక ఫ్లెక్సిబుల్ హెచ్.డి.పి.ఇ. పైపు ద్వారా నీరు పైకి వస్తుంది. మోటార్‌ను వర్షం నుండి రక్షించటానికి ప్లాస్టిక్ కవర్‌తో కప్పుతారు. ఈ రకమైన పంపుసెట్లు ఏర్పాటు చేయటం వలన నీరు రెండింతలు వస్తుందని అన్నా విశ్వ విద్యాలయంలోని సెంటర్ ఫర్ వాటర్ రిసోర్సెస్ వారు ధృవీకరించారు. ప్రయోగాత్మకంగా పరిమిత సంఖ్యలో నాబార్డ్ వారు ఈ పంపుసెట్లు ఏర్పాటు చేసుకునే వారికి రూ. 13,500లు సబ్సిడీ కూడా అందజేస్తున్నారు. ఇంకా వివరాలు కావలసిన వారు సంప్రదించవలసిన చిరునామా : శ్రీ యం. పార్థసారథి, పొలైన్ గ్రూప్ ఎ-11 & ఎ-12, టి.వి.కె. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నయ్ - 600 032 ఫోన్ నెం. 044-22500306. ●

# ప్రత్తి విత్తనాలను నారు పోసి నాటిన ఆదర్శ రైతు


## విజయవంతమైన వరంగల్ జిల్లా రైతు కంచెర్ల రామిరెడ్డి వినూత్న ప్రయోగం

వరంగల్ జిల్లా గూడూర్ మండలానికి చెందిన కంచెర్ల రాంరెడ్డి అనే రైతు మొదట తన వ్యవసాయ భూమిలో అందరి రైతుల్లాగే పత్తి విత్తనాలను నాటాడు.



కాని వర్షాభావం వల్ల విత్తనాలు సరిగ్గా మొలకెత్తలేదు. దాంతో అతనికి ఒక ఆలోచన వచ్చింది. అది ప్లాస్టిక్ గ్లాసులలో నారు పోవయడం. అతడు వెంటనే తన పని ప్రారంభించాడు. తన ఎకరం భూమిలోకి సరిపడా విత్తనాలను 3000 గ్లాసులలో మట్టి, పెంట కలిపి నింపి నీరు చిలకరించి విత్తనాలను నాటాడు. ఆ తర్వాత ప్రతిరోజు వాటిపై నీటిని స్ప్రే చేయసాగాడు. ఇలా మూడు రోజులు చేయగా విత్తనాలు మొలకెత్తాయి. వాటికి 5 రోజుల వరకు నీరందించి తన భూమిలో నాటాడు. ఇలా చేయటం వల్ల వర్షాభావ పరిస్థితులను అధిగమించి మొలక వచ్చింది. సులభంగా నీటిని అందించడం ద్వారా వర్షాభావాన్ని అధిగమించవచ్చు. భూమిలో నాటేటపుడు మొలకలు మిస్ కాకుండా నాటవచ్చు. ఇది రైతులకు చాలా లాభదాయకమైన పద్ధతి అంటున్నాడు రాంరెడ్డి.

ఈరకమైన పద్ధతిని గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి : కంచెర్ల రాంరెడ్డి, (తండ్రి కృష్ణారెడ్డి), గూడూరు మండలం, వరంగల్ జిల్లా. ఫోన్ : 78937 94947.



# తిరుపాలయ్య ప్రయోగాలు

కర్నూలు జిల్లా పగిడ్యాల మండలం ప్రాతకోటకు చెందిన ఐ. తిరుపాలయ్య గత పది సంవత్సరాలుగా పర్యావరణం, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాలలో ఎన్నో ఇన్నోవేషన్లను తయారు చేశాడు.

మొట్టమొదటిసారి 2001లో ఆవిరి యంత్రం (స్టీమ్ ఇంజన్)ను తయారు చేసి దానిని దగ్గరలోవున్న జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు తీసుకువెళ్ళి అక్కడి మెకానికల్ ప్రొఫెసర్ గారికి చూపించారు. ఆ యంత్రాన్ని చూసిన వారు ఇది ఇదివరకు ఉన్నదే అయినా మీరు తయారు చేసిన విధానం కొత్తగా ఉన్నదని అన్నారు. తర్వాత ఇదే ఆవిరి యంత్రాన్ని ఇంకో పద్ధతిలో తయారు చేశాడు ఈ యంత్రం ప్రస్తుతం ఎక్కడా ప్రదర్శించలేదు.

వ్యవసాయానికి సంబంధించి ఎద్దులతో పొలానికి నీరు పెట్టుకోవటానికి తయారు చేశారు. గానుగ పద్ధతిలో ఉంటుందిది. దీని నమూనాను తన గ్రామంలోని వ్యవసాయదారులకు చూపించగా కొంతమంది బావుందని, పర్యావరణాన్ని అనుకూలంగాను, రైతులకు ఉపయోగంగా వుంటుదని, దీని ద్వారా పంటలను పండించుకోవటం సులభంగా వుంటుందని అంటున్నారు.

తిరుపాలయ్య గ్రామం గుండా కె.సి. కెనాల్ ప్రవహిస్తుంది. ఆ కెనాల్ ద్వారా పంటలు పుష్కలంగా పండుతున్నాయి. కె.సి. కెనాల్ నుండి నీటిని కాల్వలకు వదిలే చోట కాల్వలోకి నీరు ఎంతో ఒత్తిడితోను వేగంగాను ప్రవహిస్తుంటుంది. ఇక్కడ ఒక టర్బయిన్‌ను ఏర్పాటు చేస్తే దాని ద్వారా వచ్చే విద్యుత్‌ను ఉపయోగించుకుని నూర్పిడి యంత్రాలకు వినియోగించుకుంటే ఎలాంటి ఖర్చు లేకుండా రైతులకు నాణ్యమైన గింజలు అందుతాయి అంటున్నాడు. ఈ ఆలోచన తనకు 2008లో వచ్చిందని, దీనికి రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని ఈ విధానాన్ని ఎవరికి తెలియజేయాలో తెలియక ఇన్నిరోజులు వేచియున్నానని ఇప్పుడు హనీబీ-ఎపి సహకారం లభించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అంటున్నాడు.

ప్రస్తుతం సోలార్ శక్తిని ఉపయోగించి చిన్న ఫ్రొక్లెయిన్‌ను తయారు చేస్తున్నానని, తనకు అందుబాటులో వున్న కొన్ని పరికరాలతో కొంత తయారు చేశానని, ఈ యంత్రం తయారీకి సహకారం అందిస్తే సమస్యలను అధిగమించి సమర్థవంతంగా, పూర్తి స్థాయిలో తయారు చేస్తానని అంటున్నాడు.

వేసవికాలంలో శరీరాన్ని చల్లగా ఉంచే ఒక కోటును తయారు చేయాలన్న ఆలోచన వుండేదని ఆ కోటుకు నడుం వద్ద ఇరువైపుల రెండు చిన్న ఫ్యాన్లను అర్చడం ద్వారా కోటు ఎల్లప్పుడూ చల్లగా వుంటుందని ఆలోచించగా దాన్ని కొద్ది రోజుల తర్వాత జపాన్ దేశంలో తయారు చేశారని టీవీలో చూసి చాలా బాధపడ్డానని, ఎందుకంటే నా దగ్గర సరియైన పరికరాలు లేకపోవటం వల్లనే కదా మనదేశం తయారు కావలసింది అక్కడ తయారైందని అంటున్నాడు. తనకు కాస్త ఆర్థిక సహాయం, కొన్ని చిన్న చిన్న పరికరాలను సమకూరిస్తే ఎంతో మందికి ఉపయోగపడేలా వీటిని తయారు చేస్తానని అంటున్నాడు.

**ఇన్నోవేటర్ చిరునామా :** టి. తిరుపాలయ్య (తండ్రి పరశురామయ్య), ప్రాతకోట గ్రామం, పగిడ్యాల మండలం, కర్నూలు జిల్లా – 518 412. ఫోన్: 99853 43036.

**తిరుపాలయ్య లాంటివాళ్ళు ఎంతమందో ఉన్నారు. వీరికి సరియైన చేయూతనివ్వటమే హనీబీఎపి ఉద్దేశ్యం. ఇలాంటి సంస్థ ఉందన్న విషయం పదిమందికీ తెలియ చేయాలని పాఠకులకు మనవి.**

**గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక**

**పల్లెసృజన**

**ను మీ వేదికగా ఉపయోగించుకోవాలనుకుంటున్నారా?**

**మీ ఆలోచన ఎంత చిన్నది అయినా సరే మేము ఆహ్వానిస్తాం**

**వెంటనే పంపండి** - సంపాదకవర్గం

## పర్యావరణ పరిరక్షణతో పాటు తక్కువ ఖర్చు అధిక దిగుబడికి

# కట్టా రామకృష్ణ సరికొత్త వ్యవసాయం



మన రాష్ట్ర రైతాంగం పొలాల్ని సాగు చేస్తున్నారు. కానీ, నేడు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు అధిక మోతాదులో వేయటం వలన భూమి, పర్యావరణం రెండూ కలుషితమై పోతున్నాయి. రసాయన ఎరువులు అధిక మోతాదులో వేసిన పంటలు మనం తినటం వలన అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. వీటినుంచి మన భూమిని, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని రక్షించుకొనుటకు సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించటం ఒక్క సరియైన మార్గం. పూర్తిగా సేంద్రియ వ్యవసాయం చేస్తే తగిన దిగుబడులు రావు. అందుకే కొద్ది మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాడు ప్రకాశం జిల్లా, నాగులుప్పులపాడు మండలం ఓబన్నపాలెం గ్రామ వాసి కట్టా రామకృష్ణ. తక్కువ ఖర్చులో భాగంగా జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులతో కలిపి భూమిలో వేసి గాలిలోని నత్రజనిని, భూమిలోని భాస్వరాన్ని ఉపయోగించు కొన్నాడు. ఈ ప్రాంత భూములు పూర్తిగా వర్జీనియా పొగాకు ఎక్కువగా పండించేవి. తొలకరిలో పంట మార్పిడి పద్ధతులలో పెసర వేయటం జరుగుతుంది. పెసర వేయటం వలన కొంత ఆదాయం వస్తుంది లేదా పచ్చిరొట్ట పైరుగా ఉపయోగ పడుతుంది. ఈయన తొలి సంవత్సరం రసాయన, సేంద్రియ ఎరువులతో కలిపి జీవన ఎరువులు వేశాడు. రసాయన మందులు కాకుండా మచ్చల పురుగు కొరకు ఎకరాకు వేపనూనె 1 లీటర్ పిచికారి చేశాడు. ఈ వేపనూనె వేయటం వలన రెక్కల పురుగులు ఆకులపై గుడ్లు పెట్టకుండా వికర్షిణిగా పనిచేసింది. దీనివలన మచ్చల పురుగు ఉధృతి తగ్గింది. అప్పుడు జీవ నియంత్రణ పైరు కాపాడి పురుగుల ఉధృతి దశలో రసాయనిక పురుగు మందులు వాడి కాపాడుకుందాం అన్న ఆలోచన వచ్చింది. దానిలో భాగంగా రెండో సంవత్సరం పూర్తిగా జీవ నియంత్రణ మందులు వాడి కాపాడుకుందాం అనుకొన్న దశలో వాతావరణ పరిస్థితుల వలన పురుగు విపరీతమై రసాయనిక మందులు కొట్టడం జరిగింది. తొలి సంవత్సరం ఖర్చు రసాయనిక పురుగు మందుల వలన పెరిగింది. రెండో సంవత్సరం ఖర్చు తగ్గింది. రెండో సంవత్సరం జీవ నియంత్రకాలు వాడటం వలన మిత్ర పురుగులు అభివృద్ధి చెంది పంట దిగుబడి వచ్చింది. సేంద్రియ ఎరువులతో జీవన ఎరువులు కలపడం వలన భూమిలో సూక్ష్మ పోషకాలు, సూక్ష్మజీవులు వృద్ధి చెంది నీటి నిల్వ శక్తి పెరిగి పైరు చివరి దశలో చెట్టు అభివృద్ధి చెందింది.

పై పద్ధతుల వలన ఇతని దిగుబడి పెరిగింది. కర్చు తగ్గింది. కొందరు రైతులు జీవ నియంత్రకాలు బాగా

పనిచేయవని అపోహలో ఉన్నారు. కాని ఇవి చాలా బాగా పనిచేశాయి. దీన్ని చూసి ప్రక్క పొలంలోని రైతులు చాలా బాగుంది అన్నారు.

తొలకరి వర్షాలకు పెసర పంట ప్రధానమైనది. ఇది తక్కువ కాలంలో పంట చేతికి వస్తుంది. తొలకరిలో మన రైతులు అవగాహనా రాహిత్యం వలన విచక్షణ రహితంగా మందులు వేసి ఖర్చు పెంచుకుంటున్నారు. సరియైన తెగుళ్ళ మందులు వేయటం లేదు. దీనివల్ల ఖర్చు పెరిగి సరియైన ఉత్పాదకత సాధించలేకపోతున్నారు. ఇది గమనించిన రామకృష్ణ తన స్వంత నిర్ణయంతో శాస్త్రవేత్తల పరిజ్ఞానంతో ఒక కొత్త పద్ధతిని కనిపెట్టాడు. దీనివల్ల సాగు ఖర్చు 15 శాతం తగ్గి 15 శాతం అధిక దిగుబడి వచ్చింది.

మామూలు పద్ధతిలో రైతులు అధిక మోతాదులో ఎరువు వేస్తున్నారు. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది. విత్తన మోతాదు ఎక్కువ పెడుతున్నారు. దీనివల్ల వర్షాలు పడ్డప్పుడు గాలి ఆడక తెల్లదోమ పెరుగుతుంది. విత్తనశుద్ధి సరిగ్గా చేయటం లేదు. దీనివలన పైరు తొలి రోజుల్లో రసం పీల్చు బెడద ఎక్కువగా వుంటుంది. కలుపు మందు వేయటం లేదు. దీనివల్ల కలుపు తీత కూలీలు ఎక్కువౌతున్నాయి. కొన్ని తెగుళ్ళు రావటానికి ఆస్కారం వుంటుంది. పై కారణాల వల్ల 15 రోజులకు మందు వేయవలసి వస్తుంది. తెగుళ్ళ మందులు పంట ఉనికిని బట్టి వేసుకొనవలెను. కాని రైతులు రెండుసార్లు వేస్తున్నారు. దీనివల్ల పంట తొందరగా తిరిగబడిపోతుంది. తొంతర తొందరగా మందులు వేయటం వలన పురుగులకు మందులను తట్టుకొనే శక్తి వస్తుంది. పై కారణాల వల్ల రైతు ఖర్చు పెరిగిన సరియైన పంట తీయలేకపోతున్నారు.

ఈ పద్ధతుల వల్ల లాభం లేదనుకున్న రామకృష్ణ తన పద్ధతిని ఉపయోగించాడు. శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులో ఎరువులు వేయడం జరిగింది. పెసర తక్కువ కాలం పంట కావున కొద్దిమేర నత్రజని పెంచడం జరిగింది. వానపాముల ఎరువుకు అజోస్పైరియం, పాస్ఫా బ్యాక్టీరియాతో కలిపి చల్లడం వలన భూమిలోని నత్రజని, నిల్వ స్వభావం పంటకు ఉపయోగపడును. వానపాముల ఎరువు వలన కొంత నీటియెద్దడిని తట్టుకుంటుంది. అధిక వర్షపాతాన్నీ తట్టుకుంటుంది. విత్తనాలను సరియైన మోతాదులో వేయటం వల్ల మొక్కకి గాలి బాగా ప్రసరించి మొక్క బాగా ధృడంగా పెరుగుతుంది. కలుపు మందును విత్తిన 24 గంటలలోపు వేయవలెను. అలా వేస్తే కలుపుయొక్క బెడద 25 రోజుల వరకు వుండదు. 25 రోజుల తర్వాత గొర్రుతో అంతరకృషి చేయవలెను. కలుపు కూలీలు తగ్గుతాయి. విత్తన శుద్ధి చేయటం వలన 25 రోజుల వరకు ఎలాంటి క్రిమి సంహారక మందులు వేయనవసరం లేదు. ఆ తర్వాత వెల్లుల్లి, మిరపకాయల కషాయాన్ని పైరుపై వేసినచో రబ్బరు పురుగులు, రసం పీల్చే పురుగులు, తామర పురుగులు రాకుండా వుంటాయి. 35 రోజులకోసారి ఆకుమచ్చ తెలుగులు రాకుండా వుండటానికి కాపర్ ఆక్సి క్లోరైడ్ 500 గ్రా.లు, కానుగ గింజల కషాయం 5 శాతం కలిపి పిచికారి చేయవలెను.

కానుగ గింజల కషాయం వలన పొగాకు లద్దె పురుగు, శనగపచ్చ పురుగు, తామర పురుగు, ఆకుమచ్చ తెగుళ్ళను రానీయదు. 40 రోజుల తర్వాత వేపనూనె పిచికారి చేసినచో తెల్ల ఈగ, మచ్చల పురుగు, రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా వుంటాయి. అందువలన వీటి ఉధృతిని తగ్గుతుంది. 45 రోజుల తర్వాత యం-45 మందును 400 గ్రా మరియు ఫ్లూ బైండిమైడ్ 40 మి.లీ. పిచికారి చేయవలెను. దీనివలన బూడిద తెగులు రాదు. దీనివల్ల మచ్చల పురుగు (గూడు పురుగు) లేకుండా పోతుంది. 55 రోజులకు తప్పు తెగుళ్ళ నివారణకు సాఫ్ (యం-45 + బావిస్టిన్) + క్లోరిపైరిపాస్ 500 మి.లీ. పిచికారి చేయవలెను. దీనివలన పైరు తొందరగా తిరగబడదు. పైరు ఆలస్యం అయినా కాయలు బాగా ధృడంగా పెరిగి మంచి దిగుబడిని ఇస్తాయి. 35, 55 రోజులకు ఒకసారి ఎకరానికి 2 కిలోల యూరియా నీటిలో కలిపి పిచికారి చేసినచో నీటి ఎద్దడిని తట్టుకొని పైరు పెరుగుతుంది. పై కారణాల వల్ల మంచి దిగుబడి వస్తుంది.

జీవ నియంత్రణ కారకాలు మనకు 5, 6 రోజులు మాత్రమే పనిచేయును. కావున 5 రోజులకు వేయడం జరిగింది. పై పద్ధతులలో 15% ఖర్చు తగ్గి, 15% దిగుబడి పెరుగుతుంది. మామూలు పద్ధతిలో పైరు వేసిన రైతులకు ఎకరాకు 6 క్వింటాళ్ళు వస్తే ఇతనికి 7 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. రైతు వివరాలు : **కట్టా రామక్రిష్ణ, ఓబన్నపాలెం, నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా. ఫోన్ : 95055 08989, 94949 08989**



# విశాఖపట్నం జిల్లాలో సేకరించిన సాంప్రదాయ జ్ఞానం



సేకరణ : కంబిడి అనిల్ కుమార్, హనీబీ స్కాట్

**దిసారి రామస్వామి, అరకు గ్రామం, డుంబ్రిగూడ మం.:**

**కడుపులో వేడి తగ్గించటానికి :**

కడుపులో వేడిగా వున్నట్టు అనిపిస్తే 'సలవాలు' చెట్టు వేరును నమిలి తినటం కాని, లేదా కొద్దిగా నీరు చేర్చి వేరును బాగా నూరి పేస్టులా తయారు చేసుకొని, 3 గ్రాముల పేస్టును నీటిలో కలుపుకుని త్రాగితే కడుపులో వేడి తగ్గుతుంది. కోడి మాంసం తినకూడదు.

**మూర్ఛ రోగానికి మందు :**



నేల ఉసిరి ఆకులు 6 గ్రాములు తీసుకుని మెత్తగా నూరి పేస్టులా తయారు చేసుకుని సగం గ్లాసు నీటిలో కలుపుకుని ఉదయం సాయంత్రం రోగిచేత తాగించాలి. ఇలా మూడు రోజులు చేస్తే మూర్ఛ రోగం తగ్గుతుంది. రోగికి అన్నం వండిన తర్వాత వచ్చిన గంజిని త్రాగించాలి.

**వాంతులు, విరేచనాలకు మందు :**

'ముప్వల్' చెట్టు వేరును కొద్దిగా తీసుకుని కొద్దిగా నీరు చేర్చి పేస్టులా తయారు చేసుకోవాలి. 6 గ్రాముల పేస్టును సగం గ్లాసు నీటిలో కలిపి రోజూ ఉదయం సాయంత్రం మూడు రోజుల పాటు తాగితే వాంతులు, విరేచనాలు తగ్గిపోతాయి. బంగాళాదుంప తినకూడదు.

**కిల్లో అర్జున్, అరకు గ్రామం :**

**కళ్ళు తిరిగితే ఉపశమనానికి :**

బట్ట సిమాంగి, ఉంబి చెట్ల ఆకులను కలిపి బాగా నూరి పేస్టులా తయారు చేసుకుని, 6 గ్రా. చొప్పున రోజూ మూడు పూటలా నీటిలో కలుపుకుని భోజనం తర్వాత త్రాగితే కళ్ళు తిరగటం తగ్గిపోతుంది.

**కడుపు నొప్పికి మందు :**

కంటసారు చెట్టు బెరడు, కునబొద్ద చెట్టు ఆకులను కలిపి కొద్దిగా నీరుపోసి నున్నగా నూరి ఒక టీ స్పూను మోతాదు పేస్టును అరగ్లాసు నీటిలో కలుపుకుని రోజుకు రెండు పూటల చొప్పున రెండు రోజులు తాగితే కడుపులో నొప్పి తగ్గిపోతుంది.

**కాళ్ళు, చేతులు, ముఖం వాసినప్పుడు :**

'చంటిమల్, గోడ్‌సిల్లి, వెంపలి చెట్టు, ముగ్‌న' చెట్ల ఆకులను తీసుకుని అన్నింటిని కలిపి కొద్దిగా నీరు చేర్చి బాగా నూరి పేస్టులా తయారు చేసుకుని, ఆ పేస్టును ఒక టీస్పూన్ అర గ్లాసు నీటిలో కలిపి రోజుకు రెండు పూటలా, రెండు రోజుల పాటు తాగితే వాపులు తగ్గిపోతాయి.

**జ్వరానికి మందు :**

పట్టముండి, లింపోతోర్ ఆకులను కాడలతో సహా తీసుకుని కొద్దిగా నీరు కలిపి నున్నగా నూరి ఒక టీస్పూను మోతాదును తీసుకుని సగం గ్లాసు నీటిలో కలిపి రోజుకు రెండు పూటల రెండు రోజుల పాటు తాగితే జ్వరం తగ్గిపోతుంది.



పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.

## తడి ఆరని పొలాల్లో సులువుగా మొక్కజొన్నలు విత్తే యంత్రం

# గ్రామీణ ఇన్నోవేటర్ గురవయ్య సృష్టి



ప్రపంచం తెలిసినప్పటినుండి కూడా రైతుగానే వున్న వ్యక్తి 'తొండపి గురవయ్య' 61 సంవత్సరాల గురవయ్యకి వ్యవసాయంలోని ఒడిదుడుకులు, దిగజారుతున్న వ్యవసాయదారుల పరిస్థితులు అన్నీ తెలుసు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలోని నకిరేకల్ మండలంలో



'రూపనగుంట' గ్రామానికి చెందిన రైతు గురవయ్య. ఈయనకి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరూ పెళ్ళిళ్ళై స్థిరపడ్డారు. నిజం చెప్పాలంటే ఈయనకి ఇక కష్టించి పనిచేయవలసిన అవసరం లేదు. కానీ ఈయనలోని రైతు ఇతన్ని విశ్రాంతిగా కూర్చోనివ్వడు. ఎప్పుడూ ఏవో సవాళ్ళని వెతకడం, వాటికి పరిష్కారాలను కనుగొనటమే పనిగా పెట్టుకున్నారీయన. ఎప్పుడూ ఏదో కొత్తదనాన్ని వెతికే ఈయన తన పొలంలో కూడా ఎన్నో పరిశోధనలు చేశారు. కుమారుడు ప్రభుత్వోద్యోగం చేస్తూవుండటంతో ఈయన తన భార్యతో తన స్వంత గ్రామంలో వ్యవసాయం చేస్తూ వుండిపోయారు.

ఒకసారి ఈయన వ్యవసాయమే ప్రధానంగా వున్న గుంటూరు జిల్లాలోని బాపట్ల పట్టణంలో ఒక రైతు సదస్సుకి హాజరయ్యారు. అక్కడ వ్యవసాయ ఇంజనీరింగ్ విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన ఒక శాస్త్రవేత్త వరిపంట కోతలు





కాగానే ఇంకా తేమగా వున్న పొలంలో మొక్కజొన్న విత్తనాలు వేయటానికి ఒక యంత్రం కనుగొనగలరా అని సవాలు విసిరారు. ఇక్కడో విషయం గమనించాలి. ఖరీఫ్‌లో వరి కోసిన తర్వాత మినుములు పండించటం కొన్ని జిల్లాల్లో ఆనవాయితీగా వస్తోంది. అయితే గత రెండుమూడేళ్ళుగా మినుముకు 'ఎల్లో మొజాయిక్ వైరస్' సోకి పంట పూర్తిగా దెబ్బతింటోంది. దీనికి ప్రత్యామ్నాయంగా రైతులు జొన్నలు పండించటం ప్రారంభించారు. అయితే జొన్నలు విత్తటానికి వ్యవసాయ కూలీలు దొరకటం చాలా దుర్భరంగా మారింది. దొరికినా చాలా ఖర్చుతో కూడుకున్న పనైంది. ఈ శాస్త్రవేత్త వరి పొలాల్లో కోతలు కాగానే భూమి తడిగా వున్నప్పుడే ఏడు రోజులలోపల మొక్కజొన్న విత్తనాలు విత్తితే ఆ తడి జొన్నలు మొలకెత్తటానికి సరిపోతాయని, అది పంటకి రెండుసార్లు నీరు పెట్టటంతో సమానమని, ఈ విధంగా చేయటం వలన నీరు ఆదా చేయటమే కాక పొలాల్లో మిగిలిపోయిన ఎరువులు పూర్తిగా ఉపయోగించుకున్నవాళ్లం అవుతాము అదేవిధంగా పొలాన్ని మళ్ళీ దున్నటం లాంటి అదనపు ఖర్చులు, శ్రమ లేకుండా తగినంత అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చు అని వివరించారు. కోస్తాంధ్ర ప్రాంతాల్లో వరికోతలు అయిపోయిన వెంటనే రైతులు ఇటువంటి పంటలు వేయటం వాడుకలో వుంది. చాలామంది రైతులు మొక్కజొన్న సాగు చేసి, మంచి దిగుబడి రావడంతో 2008వ సంవత్సరంలో రికార్డు స్థాయిలో 12.20 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. కాకపోతే దానికి వ్యవసాయ కూలీలను వాడటం చాలా ఖర్చుతో కూడుకున్నదిగా వుండేది. అందుకే ఆ శాస్త్రవేత్త మొక్కజొన్న విత్తటానికి ఒక యంత్రాన్ని కనుగొనరా అని సవాలు చేశారు.

ఇంకా చాలామంది రైతులు ఈ దున్నే అవసరం లేకుండా వ్యవసాయం చేయటానికి ఉత్సాహం చూపించినా దానికయ్యే ఖర్చు చూసి వెనుకంజ వేస్తున్నారు. దున్నే అవసరం లేకుండా విత్తనాలు నాటే యంత్రాలు బజార్లో దొరుకుతున్నా అవి లోతుగా కాక, భూమిమీద విత్తనాలు చల్లుతాయి కనుక ఈ విషయంలో పనికిరావు. 7 రోజుల్లో భూమి తడిగా వున్నప్పుడే అన్ని ఎకరాల్లో విత్తనాలు నాటాలంటే చాలామంది కూలీలు, దానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. పైగా ఆ సమయంలో వరికోతలు జోరుగా వుంటాయి కనుక కూలీలు దొరకటం కూడా కష్టమే. ఏమాత్రం ఆలస్యం అయినా భూమిలోని తడి ఆరిపోయి పద్ద శ్రమంతా వృధా అవుతుంది. కానీ, దీనికి పనికివచ్చే విత్తనాలు నాటే యంత్రం మార్కెట్లో దొరకటం లేదు.


శాస్త్రవేత్త విసిరిన సవాలును గురవయ్య స్వీకరించాడు. దీనికై పనికివచ్చే ఒక సాధనం ట్రాక్టరుకు అనుసంధానంగా తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. ముందుగా తనముందున్న సమస్యని నాలుగు భాగాలుగా చేసి విశ్లేషించాడు. భూమిలోకి ఒకటిన్నర సెంటీమీటర్ల లోతుకి సాలు చేయటం, అవసరమైనంత దూరంలో, వరుసలలో విత్తనాలు చల్లటం, ఆ తర్వాత విత్తనం వేసిన కన్నాలను పూడ్చటం, చివరిగా తడి నేలలో వున్న కలుపు మొక్కలను నిర్మూలించటానికి మందు చల్లటం. తాను ఈ పనిని తప్పకుండా చేయగలనని నమ్మకమున్నా దానికి తగ్గ





పూర్తి సాంకేతిక జ్ఞానం తనదగ్గర లేదనిపించింది ఆయనకి. అలాగే దానికి తగ్గ ఆర్థిక వనరులు కూడా ఆయనవద్ద లేవు. చాలామంది రైతులు ఏదో కనిపెట్టాలి అని వున్నా, ఈ కారణంగానే తమలోని ఆలోచనలను కార్యరూపంలో పెట్టలేక పోతున్నారు. ఎలాగైనా ఈ యంత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు గురవయ్య. గురవయ్య సంకల్పాన్ని పట్టుదలని గమనించిన అధికారులు ఆయన్ని నల్గొండ జిల్లా కంపాసాగర్‌లో వున్న వ్యవసాయ పరిశోధనా స్థానానికి పంపారు. అయితే అక్కడ వ్యవసాయ ఇంజనీర్లు లేకపోవటంతో గురవయ్య ఆలోచనలు కార్యరూపంలో పెట్టేందుకు సరియైన సహాయం లభించలేదు.

కానీ, గురవయ్య నిరాశ చెందలేదు. ఆయన బాపట్లలోని వ్యవసాయ ఇంజనీరింగ్ విశ్వ విద్యాలయ ప్రధాన అధికారి శ్రీ సత్యనారాయణ గారిని కలిశారు. ఆయనకి తన ఆలోచన వివరించి, దేవుడిలాంటి మీరు నా ఆలోచనలకి రూపకల్పన చేసి సహకారం చేయటానికి తగిన సహాయం, ప్రోత్సాహం చేయవలసిందిగా కోరారు. సత్యనారాయణ గారికి ఈ ఆలోచన బాగా నచ్చింది. ఆయన వెంటనే తమ కళాశాలలోని వ్యవసాయ పనిముట్ల విభాగంలోని శ్రీ ఎ.వి. సుబ్బారావుకి ఈ పనిని అప్పజెప్పారు. సత్యనారాయణ గారు, సుబ్బారావుగారు, గురవయ్యలు ఈ త్రిమూర్తులు చాలా పట్టుదలగా దీక్షగా పని ప్రారంభించారు. సత్యనారాయణ గారి నేతృత్వంలో సృజనాత్మకత కలిగిన గురవయ్య, ఉత్తమమైన మెకానికల్ నేర్పు కలిగిన సుబ్బారావులు ఎట్టకేలకు అనుకున్న



యంత్రాన్ని తయారు చేశారు.

వీరు మూడు నెలలు కష్టపడి కళాశాలలో వున్న వేరుశనగ విత్తనాలు నాటే యంత్రాన్ని మూనాగా తీసుకొని దానికి అనుకున్న మార్పులు, చేర్పులు చేసి ఈ మొక్కజొన్న విత్తే యంత్రాన్ని రూపొందించారు. వారు ఈ యంత్రంలో ఫ్రేములో, రూపంలో విత్తనాలు నాటే పద్ధతిలో చాలా మార్పులు చేశారు. వారికి దానికైన ఖర్చు రూ. 10 వేలు. ఆ యంత్రం ఖరీదు రూ. 45 వేలు.

గురవయ్య విత్తనాలు నాటే యంత్రాన్ని కళాశాల ప్రాంతంలో 2010లో వాడి చూడగా అది అద్భుతంగా పనిచేసింది. వేసిన మొక్కజొన్న పంట కూడా సంతృప్తి కరమైన దిగుబడినిచ్చింది. సాధారణంగా కూలీల సహాయంతో అయితే రోజుకు ఒక ఎకరా పొలంలో మాత్రమే మొక్కజొన్న విత్తనాలు విత్తగలరు. అదే ఈ యంత్రంతోనైతే రోజుకు 10 ఎకరాల్లో మొక్కజొన్న విత్తనాలు విత్తుకోవచ్చు.





దీనివలన రైతుకు ఖర్చు గణనీయంగా తగ్గటమే కాక, శ్రమ తప్పి, సమయం కూడా ఆదా అవుతుంది. అంతే కాక పొలంలో తేమ ఆరకముందే విత్తనం నాటడం జరుగుతోంది.

ఇప్పుడు గురవయ్య ఈ యంత్రంపైనే కలుపు మొక్కల నివారణకై ఇంజన్‌తో పనిచేసే పంపు, దానికొక ట్యాంకు ఏర్పాటు చేసే ప్రయత్నంలో వున్నారు. ఆయన ఆలోచన ప్రకారం విత్తనాలు నాటేటప్పుడే కలుపు మొక్కల నివారణకై స్ప్రే చేస్తూ వుంటే మళ్ళీ ఒకసారి దానికై ట్రాక్టరును నడపాల్సిన అవసరముండదు. ఇది సాధ్యమయ్యే ఆలోచనే అయినా కళాశాలలో తగినన్ని నిధులు లేక ఈ పనికి అంతరాయం ఏర్పడింది.

బాపట్లలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలోని నిపుణులు గురవయ్య రూపొందించిన విత్తనాలు నాటే యంత్రం చాలా బాగా పనిచేస్తోందని ధృవీకరించారు. ఇప్పుడు చేయాల్సిందల్లా కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని రైతుల సౌకర్యార్థం వారు తమ వరి పొలాల్లో కోతలు అయిపోయిన వెంటనే మొక్కజొన్న నాటటానికి వారికీ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకు రావాలి.

హనీబీ ఆంధ్రప్రదేశ్ వారికి స్వతహాగా గ్రాస్‌రూట్ స్థాయి ఇన్నోవేటర్‌గా రాష్ట్రపతి ద్వారా పురస్కారం అందుకున్న శ్రీ ఉప్పుతేళ్ళ కృష్ణ గురవయ్యను పరిచయం చేశారు. హనీబీ ఎపి సమన్వయకర్త బ్రిగేడియర్ గణేశం బాపట్ల వెళ్ళి గురవయ్య గారిని కలిసి వివరాలు సేకరించారు. ఆయన ఈ ఇన్నోవేషన్ గురించి ఎన్ఐఎఫ్ కి (ఎన్ఐఎఫ్/యన్‌టి/ఇ 806 ఎపి487) తెలియజేసి గురవయ్య మొక్కజొన్నలు నాటే యంత్రాన్ని మార్కెటింగ్ చేయటానికి ఆర్థిక సహాయం చేయవలసిందిగా కోరారు. ఎవరైనా ఈ యంత్రానికి సంబంధించిన వ్యాపార వ్యవహారాలు చేయదలచుకున్న ఔత్సాహిక వ్యాపారవేత్తలు, సంస్థలు హనీబీఎపి, ఫోన్ 98660 01678 నికాని, లేదా honeybeeap@gmail.com మెయిల్ ద్వారా కాని సంప్రదించవచ్చు.

ఒక సాధారణ రైతు వరిపంట కోతలు జరిపిన వెంటనే భూమిలోనున్న తడిని వృధా చేయకుండా వ్యవసాయ కార్మికులకయ్యే ఖర్చుని తగ్గించటానికి జొన్న విత్తనాలు నాటే యంత్రాన్ని కనుగొని, కోస్తాంధ్ర ప్రాంతంలోని వేలకొద్దీ వ్యవసాయ దారులు, లక్షలకొద్ది ఎకరాల్లో రెండో పంట వేసి అదనపు ఆదాయం సమకూర్చుకునే ప్రయత్నం చేసి సఫలీకృతుడైనాడు. వ్యవసాయదారుల సమస్యలని అవగాహన చేసుకోవటం, పట్టుదల దీక్షతో దానికొక పరిష్కారం కనుగొనటం ఎంతైనా మెచ్చుకోదగ్గ విషయం. గురవయ్య గ్రామీణ శాస్త్రవేత్త. ఒక ఇంజనీరు, ఒక వ్యవసాయ శాస్త్రవేత్త, ఉత్తమైన వ్యవసాయదారుడే కాక, ఒక అద్భుతమైన వ్యక్తి.

ఈ పరికరం త్వరలో అందరు రైతులకి అందుబాటులోకి తీసుకు రావటమే మాకు కావలసింది. ఇదే గురవయ్య కోరిక. ఆయన ఈ పరికరం ద్వారా దేశంలోని రైతాంగం ఆర్థికంగా బాగుపడాలన్న తన కల నిజమౌతుందని ఆశిస్తున్నాడు. గురవయ్యగారిని సంప్రదించాలంటే ఫోన్ నెం. 99890 87931 కి కాల్ చేయండి.

●



# మన మల్లేశానికి జాతీయ స్థాయిలో 'శాంసంగ్' వారి బహుమతి

**భారతదేశంలోని నలుమూలల నుంచి ఇన్నోవేటర్ల ప్రతిభను గుర్తించేందుకు జాతీయ స్థాయిలో 'శాంసంగ్ ఇన్నోవేషన్ కోషంట్' పేరున శాంసంగ్ సంస్థ మే, 2011లో ఒక ప్రక్రియ ప్రారంభించింది. దీని సమావేశం భారత రాజధాని ఢిల్లీలో జరిగింది. ఈ ప్రతిభా పోటీలు ప్రజల సమస్యలను తొలగించటానికి ఏదైనా సమాధానం, లేదా ప్రత్యేకమైన పద్ధతి, లేదా వస్తువును కనుగొన్న వారిని గుర్తించి వారి కల్పనను నలుగురికి తెలియజేసి, వారిని సత్కరించటం కొరకు ఉద్దేశించబడినది.**

శాంసంగ్ సంస్థ వారు జాతీయ స్థాయిలో ప్రారంభించిన ఈ ప్రక్రియలో సమాజానికి, లేదా ఏదైనా వ్యాపారాన్ని అభివృద్ధి పరచటంలో నూతన ఒరవడి సృష్టించిన వారిని, వారి ఆలోచనా కార్యక్రమం ద్వారా నూతన ఆవిష్కరణ చేసిన వారిని గుర్తించటానికి చేసిన ఈ ప్రయత్నంలో దేశం నలుమూలల నుంచి 300కు పైగా వ్యక్తిగతంగా లేదా సామాజిక సంస్థల నుండి దరఖాస్తులు వచ్చాయి. వాటిలో మేటిగా నిలిచిన ఇన్నోవేషన్లలో కళ్ళకి సంబంధించిన 5 రకాల వ్యాధులను కనిపెట్టి, ఎక్కడికైనా సరే తీసుకువెళ్ళగలిగే తేలికపాటి యంత్రం, ఇంట్లోనే కూర్చుని రైతు తన పొలంలోని మోటార్ పంపుని మొబైల్ ఫోన్ ద్వారా రిమోట్‌గా నడిపించే పద్ధతి లాంటి ఇన్నోవేషన్లతో పాటు, మన ఆంధ్రప్రదేశ్ ఆలేరుకు చెందిన చింతకింది మల్లేశం కనిపెట్టిన 'లక్ష్మి ఆసు యంత్రం' కూడా వుంది. ఇది మనకెంతో గర్వించదగ్గ విషయం.

తన తల్లి చీరలు నేయటానికి ఆసు పోయటం వల్ల పడుతున్న కష్టాలను గమనించి, అది తీర్చటం కోసం తనదైన శైలిలో ఆలోచించి, తన తల్లితో పాటు ఈ పనిని చేతితో చేసే వారి శ్రమను తగ్గించటం కోసం ఒక యంత్రం కనిపెట్టాడు. దానికి తన తల్లిపేరే పెట్టాడు. ఈ యంత్రానికి ప్రాచుర్యం కల్పించటం కోసం 'పల్లెసృజన' ఆర్థిక సహాయం చేసి, ఆ ప్రాంతంలోని అనేక నేత కుటుంబాలకి ఈ అందే ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఈ యంత్రం వాడే వారంతా 'ఆసు కుటుంబం'గా చెప్పుకుంటూ ఆర్థికంగా తాము బాగు పడటమే కాక, సమాజానికి కూడా సహాయం చేయటానికి ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలోనే వారికి సిల్కు దారం అందించటానికి 'సిల్కు బ్యాంకు'ను కూడా పల్లెసృజన సహాయంతో ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా సమయానికి దారం అందటమే కాక, వారు నేసే బట్టల నాణ్యత ఎంతో మెరుగై మంచి ధర గిట్టుబాటవుతోంది.




**ఈ సందర్భంలో చింతకింది మల్లేశంకు తెలుగు ఇన్నోవేటర్ల తరుపున, సంపాదకవర్గ శుభాకాంక్షలు**

## "పల్లెసృజన" ఆధ్వర్యంలో

# ఆసు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం

నల్గొండ జిల్లాలోని 'ఆలేరు' లో ఆసు యంత్రం సృష్టికర్త శ్రీ మల్లేశం గారి ఇంట్లో 8 సెప్టెంబర్, 2011 నాడు ఆసు యంత్రం వాడే 25 స్త్రీ పురుషుల సమావేశం నిర్ణయించబడింది. వీరిలో ఇంతకుముందు జరిగిన 5 సమావేశాల్లో నాలుగింటికి హాజరైన ఒక మహిళ కూడా ఉన్నది. సమావేశంలోని ముఖ్యాంశాలు :

చాలామంది నేతపనివారు సిల్కు ధర అందుబాటులో లేదని తమ పనులు వదిలేసి పట్టణాలకు వలస పోయినవాళ్ళు ఇప్పుడు క్రమంగా తిరిగి వస్తున్నారు. వీరంతా గతంలో మగ్గాలు లేనివాళ్ళు, ఆసుగురించి, చీర నేయటం లేదా టై & డై ప్రక్రియ తెలియని వారు తరతరాల నుంచి సిల్కు చీరలు తయారు చేసే వారు, వీరిని చీరలు మగ్గాలపై నేయటానికి పనివారుగా పెట్టుకొనేవారు. వాళ్ళు దారం ఇస్తే వీళ్ళు చీరలు నేసి పెట్టేవారు. చీరలు నేయటానికి ఇదివరకు చెల్లించే రూ. 230 కి బదులు ఇప్పుడు రూ. 500 చెల్లించాలన్న నేతగాళ్ళ నిర్ణయం ద్వారా ఇది సాధ్యపడింది. ఇప్పుడు వీరికి చీరల ధరలు పెరగటం వలన వచ్చే అధిక ఆదాయం మిగతా వలసపోయిన వారిని తిరిగి వృత్తిలోకి రప్పించటానికి వాడతామని చెపుతున్నారు. దీనివల్ల వీరికి దాదాపు పట్టణాలలో వారికి వచ్చే ఆదాయంతో సమానంగా ప్రతినెలా దాదాపు రూ. 4,500లు సంపాదించ గలుగుతున్నారు. ఇలా కలిసి నిర్ణయాలు తీసుకోవటం, ఒకరికొకరు సహాయం చేసుకోవాలని కోరుకోవటం చాలా ఆరోగ్యకరమైన శుభ పరిణామంగా భావించవచ్చు. వీరి నిర్ణయాల వల్ల లాభాలు కొంచెం తగ్గినా అందరూ కలిసి ఆనందంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

సిల్కు నిధి నుండి దారం తీసుకుని, పదకొండుమంది నేతగాళ్ళు తమకు చాలా లాభాలు కలిగాయని తెలియజేశారు. 1. ప్రతి కిలోకి 150 గ్రా. సిల్కు ఆదా. 2. దారాన్ని శుభ్రం చేయటానికి పట్టే సమయంలో మూడో వంతు సమయం ఆదా. 3. నీళ్ళ వాడకంలో ఆదా, వేడి చేయటానికి గ్యాసు లేదా కట్టెల్లో ఆదా. 4. చీర నాణ్యతలో చెప్పుకోదగ్గ మార్పు.

కొనుగోలుదారులు ఈ చీరలు బాగున్నాయి అంటున్నారే కాని, అధిక ధరలు చెల్లించటం లేదు. వారికి పెరిగిన నాణ్యతను గుర్తించి, దానికి తగ్గ అధిక ధరలు చెల్లించేలా ఒప్పించటానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించటం జరిగింది. త్వరలో ఆసు సిల్కు నిధి నుండి వంద మగ్గాలకు సిల్కు దారం అందించటం ద్వారా సుమారు 800 చీరలు అదనంగా తయారౌతాయి. వాటి నాణ్యతని గుర్తించి కొనుగోలుదారులు అధిక ధరలు చెల్లించేలా చూసుకోవాలి.

నాణ్యమైన సిల్కు దారం అందిస్తున్నారని తెలిసినా ఆ ప్రాంతంలోని చాలామంది ఈ ఆసు కుటుంబంలో చేరాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఇందులో చేరి తాము బాగు పడటమే కాక, తమ సమాజానికి కూడా మేలు చేయాలని కోరుకుంటున్నారు.

కేవలం బార్డర్లు నేసేవారికి ప్రత్యేకమైన దారం అవసరమౌతుంది. దానిని ఒక నెల రోజుల లోపల వారికి అందజేసి, తర్వాత పురోగతిని సమీక్షించాలని నిర్ణయించటం జరిగింది. ఈ నెలలో చాలామందికి సిల్కు నిధినుండి దారం అందజేయాల్సి వుంటుంది. అది చేయటానికి అధిక ద్రవ్యనిధులు సమకూర్చుకోవాల్సి వుంటుంది. దీనికై ముందు ఎవరు వస్తే వారికి అన్న పద్ధతిన మగ్గం వున్న కుటుంబాలలో ఒకరికే దారం అందజేయాలని నిర్ణయించడమైనది. ఇవ్వగలిగిన వాళ్ళు తమ ఋణాన్ని త్వరగా చెల్లించాలని, దాని ద్వారా ఇంకా ఎక్కువ మందికి, మగ్గాలకి సహాయం చేసే అవకావం వస్తుందని అందరికీ తెలియజేయటం జరిగింది.

ఆసు సిల్కు నిది నుండి మగ్గానికి దారం రూ. 10 వేలుగా నిర్ణయించే విషయం చర్చించాక సిల్కు దారం పొందిన రెండో నెల నుంచి కిలోకి రూ. 100 డిపాజిట్ చేయాలని ఈ అప్పు తీర్చటానికై సంతోషంగా ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఇప్పటికి 45 కుటుంబాలకి వంద మగ్గాలకి 17 ఆసు యంత్రాలు సరఫరా చేయటం జరిగింది. త్వరలో మరో 10 యంత్రాలు సరఫరా చేయాలని తీర్మానించారు. ఈసారి మారుమూల గ్రామాల్లో వారికి కూడా లక్ష్మి ఆసు యంత్రంలాభాలు అందేలా చూడాలని అనుకున్నారు.

ఆసు యంత్రం తీసుకుని దాని ఖరీదు తిరిగి చెల్లిస్తే వచ్చే డబ్బుతో మరికొన్ని ఆసు యంత్రాలను అందజేసే పథకాన్ని అందరూ హర్షించారు. ఇంతవరకు ఈ పతకం ప్రగతి ఈ క్రింది విధంగా వుంది.

| **ఆసు కుటుంబ సమావేశము** | **సరఫరా చేసిన ఆసు యంత్రాలు** | **సభ్యులు తిరిగి చెల్లించిన బాకీ రూ.** |
|---|---|---|
| 1. 19-1-2011 | 8 | 6,000/- |
| 2. 18-3-2011 | 10 | 3,500/- |
| 3. 18-5-2011 | 12 | 6,000/- |
| 4. 15-7-2011 | 15 | 8,500/- |
| 5. 18-9-2011 | 17 | 10,000/- |
| **మొత్తం** | | **34,000/-** |

ఈ విధంగా వసూలు చేసిన రూ. 34 వేలు సరఫరా చేసిన 17 ఆసు యంత్రాలలో కేవలం 8 శాతం మాత్రమే అవుతుంది. కానీ భవిష్యత్తులో ఋణాల వసూళ్ళు పెరుగుతాయని భావించబడుతోంది. అనుకున్న దానికన్నా త్వరగా ఋణాలు వసూలైతే ప్రతి రెండు నెలలకి ఒక ఆసు యంత్రం అదనంగా అందించవచ్చు. ఆసు కుటుంబ సభ్యుల ఉత్సాహమే ఈ పథకం విజయానికి కారణమని వాళ్ళు తెలుసుకున్నారు. ముందు యంత్రాలు తీసుకున్న లబ్ధిదారులు ఇప్పటికి రెండు కొత్త యంత్రాలకు తగ్గ డబ్బు వాపస్ చేయటం జరిగింది.

అమెరికా వాసి శ్రీ నాగేశ్వర రావు 8 చీరలు అమ్మి పెట్టినందుకు ఆయనను అందరూ అభినందించారు. ఆసు కుటుంబ సభ్యులే ముందుకు వచ్చి వారు నేసిన చీరల అమ్మకాలు వారే చేపట్టాలని కోరాము. దానికి పల్లెసృజన తరుపున ప్రత్యేక ప్రదర్శనలు, కాలనీలల్లో అమ్మకాలు మొదలైనవి ఏర్పాటు చేస్తామని చెప్పాము. అప్పటికప్పుడు ఎవ్వరూ ముందుకు రాకపోయినా విషయం వారికి బోధపడిందని తెలుసుకున్నాము.

అక్కడ గుమికూడిన ఆసు కుటుంబ సభ్యులందరికీ అమెరికాలోని న్యూజెర్సీలో 2-8-2011 నాడు 20 మంది హాజరైన సమావేశ వివరాలను గురించి తెలియజేశాము. ఎక్కడో ప్రపంచంలో తమ గురించి తెలుసుకుని ఆలోచించేవారున్నారని విని మహదానంద పడ్డారు. వారంతా తమకి ఆసు యంత్రాలు అందజేయటంలో సహాయ సహకారాలు అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు చెపుతూ వారి సహాయం వృధా పోకుండా కలిసికట్టుగా నియమబద్ధంగా ఈ పథకం నడుపుకుంటామని మాట ఇచ్చారు.

మొదటిసారిగా ఆసు కుటుంబ సభ్యుల సమావేశానికి ఒక నేతగాని పట్టభద్రుడైన తనయుడు హాజరై తమవాళ్ళ శ్రేయస్సుకి తప్పకుండా పాటుపడతానని వాగ్దానం చేశాడు. జూన్, 2011లో ఒక ఆసు యంత్రాన్ని సహాయంగా పొందిన ఒక మహిళ తన ముగ్గురు పిల్లలని ఈ యంత్రం సహాయంతో చక్కగా పోషించుకోగలుగుతున్నా నని మెరిసే కళ్ళతో ఆనందంగా చెప్పింది. ఆమె కొందరు పనివాళ్ళను పెట్టుకొని నెలకి 32 చీరలు నేయిస్తోంది. ఇది కేవలం మీ ఆసు యంత్రం వల్లనే సాధ్యపడిందని కృతజ్ఞత తెలిపింది. ఆమెకి ఆసు సిల్క్ నిధినుండి సహాయం అందజేయవలసి వుంది.

మల్లేశం ఒక ఎలక్ట్రానిక్ బరువు తూచే యంత్రం, సిల్క్ దారాల లెక్కలు వ్రాయటానికి కొన్ని పుస్తకాలు, కాగితాలు కొన్న వివరాలు తెలియజేయగా దానికైన ఖర్చు పల్లెసృజన సమన్వయకర్తలు భరిస్తారని తెలియజేశాము. తర్వాత మల్లేశం సతీమణి సువర్ణ అందరికీ తాను తయారు చేసిన భోజనం ఏర్పాటు చేసింది. అంతమంచి భోజనం ఎప్పుడూ తినలేదెవరూ. భోజన సమయంలో కూడా కుటుంబ సభ్యులు తాము చేస్తున్న కార్యక్రమాలు ఇంకా బాగా అందరికీ మేలు జరిగేలా చేయాలని అనుకోవటం ఆనందాన్ని కలుగజేసింది.



# ఇతర రాష్ట్రాల ఇన్నోవేషన్లు

## చెక్కను కోసే యంత్రం



అస్సాంకు చెందిన కరుణ కాంతనాథ్ చేతితో పనిచేసే చెక్కను కోసే యంత్రాన్ని తయారు చేశాడు. ఇదెంతో సమర్థవంతంగా, నాణ్యమైన పని చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా దీనిని ఎక్కడ పనివుంటే అక్కడికి తీసుకువెళ్ళి పనిచేసుకోవచ్చు. చెక్కను రంపంతో చేతితో కోయటం బదులు ఈ యంత్రంతో సులభంగా పని చేసుకో వచ్చు. మామూలు కుట్టుమిషన్‌లో లాగానే దీనికీ చిన్నచిన్న సర్దుబాట్లు చేసుకునే అవకాశం వుంది. ఈ యంత్రంతో ముగ్గురు చేసే పని ఒక్కరే చేయవచ్చు. దీనిని కనిపెట్టిన కరుణ కాంతనాథ్ అనేక బాబిన్‌లు వున్న రాట్నాన్ని, అలాగే వెదురుని అడ్డం నరికే యంత్రాన్ని కూడా కనిపెట్టాడు. ఎన్.ఐ.ఎఫ్. పథకం ద్వారా ఇతనికి సహాయాన్ని అందజేయగా ఆ ప్రాంతంలో అనేకమంది చిన్నపాటి వ్యాపారుల అభివృద్ధికి తోడ్పడ్డాడు.



2005లో మూడవ జాతీయ గ్రాస్‌రూట్ లెవెల్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో ఈయనకి బహుమతి కూడా ఇవ్వబడినది.





## గుడ్లను పొదిగే యంత్రం





అస్సాంకు చెందిన 'మిలన్ జ్యోతిదాస్' సక్రమంగా గుడ్లను పొదగటానికై సరైన మోతాదులో తేమ, వేడి ఉండేలా చూడటానికి ప్లయ్‌వుడ్, థర్మాకోల్‌ల సహాయంతో ఒక గుడ్డును పొదిగే యంత్రాన్ని తయారు చేశాడు. ఈ యూనిట్‌లో రెండు భాగాలుంటాయి. దీనికై కరెంటు లైటుతో కానీ, కరెంటు లేకపోతే కిరోసిన్ దీపంతో కాని కావలసిన వేడి పుట్టించవచ్చు. ఆ వెలుతురు తీవ్రతని నియంత్రించ టానికి ఒక రెగ్యులేటర్‌ను కూడా అమర్చబడింది.

ఎన్.ఐ.ఎఫ్. సహాయంతో ఇతను స్థానికంగా కొన్ని యంత్రాలతో పాటు 'శిబ్‌సాగర్' డి.ఆర్.డి.ఎ.కు, మణిపూర్ లోని ఒక ఎన్జీవోకు కూడా వీటిని అమ్మాడు. ఇతనికి ఎం.వి.ఐ.ఎఫ్. పతకం క్రింద ఎన్.ఐ.ఎఫ్. సహాయం అందిస్తోంది.

## వెదురుకు పాలిష్ చేసే యంత్రం





అస్సాంకు చెందిన 'నసీమ్ అహమ్మద్' వెదురుతో చేసే తెరలు, చాపలకు ఉపయోగించే వెదురు పుల్లలకు పాలిష్ చేసే యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ యంత్రం సహాయంతో పుల్లలని నునుపుగా చేయవచ్చు. దీనితో గంటన్నరలో వంద కిలోల వెదురు పుల్లలని నునుపు చేసి, పాలిష్ చేయవచ్చు. దీనికి సాధారణంగా అయ్యే ఖర్చుతో పోలిస్తే యంత్రంతో చేస్తే అయ్యే ఖర్చు చాలా తక్కువ. ఈ యంత్రాన్ని నడపటానికి పుల్లలని సర్దటానికి ఒక వ్యక్తి చాలు.

## అనేక చెక్క పనులకు ఉపయోగపడే యంత్రం





చెక్కతో పనిచేసే చిన్న చిన్న వడ్రంగులు తాము చేసే పనులకి అవసరమయ్యే వేర్వేరు యంత్రాలు ఎక్కువ ఖర్చు అవుతుందనో, తగ్గ స్థలం లేదనో లేదా ఇన్ని యంత్రాలు నడిపించడం సాధ్యం కాదన్న కారణంగా ఎంతో ఇబ్బంది పడుతూ వుంటారు. అలాంటి వారికి ఊరట కలిగించటం కొరకు అస్సాంకు చెందిన 'గోనకంట గొగొయ్' అనేక వడ్రంగి పనులు చేయటానికి కాలుతో తొక్కితే పనిచేసే ఒక యంత్రాన్ని రూపొందించాడు. దీని సహాయంతో కావలసిన పనులు ఒకే స్థలం నుంచి చేయటమే కాక, నాణ్యమైన ఉత్పత్తులను కూడా తయారు చేసుకోవచ్చు.

## వెల్లుల్లి వలిచే మరియు నిమ్మకాయలు కోసే యంత్రాలు









ఊరగాయల పరిశ్రమలో వెల్లుల్లిని త్వరగా శుభ్రంగా వలవటం ఒక ముఖ్యమైన ప్రక్రియ. దీనిని సమర్థవంతంగా చేయటం కొరకు తమిళనాడుకు చెందిన యం. నాగరాజన్ ఒక యంత్రాన్ని కనుగొన్నాడు. ఆహార పదార్థాలకి పనికి వచ్చే విధంగా ఈ యంత్రాన్ని రూపొందించాడు. దీంతో ఎక్కువ సంఖ్యలో వెల్లుల్లి వలిచే ప్రక్రియను తనంతట తానే పనిచేసే విధంగా తయారు చేశాడు. వ్యర్థాలు అతి తక్కువగా ఉండే ఈ యంత్రంతో ఊరగాయ, మూలికా ఔషధాల పరిశ్రమలు చాలా లాభసాటిగా ఉపయోగించుకోవచ్చు.

ఈయన చేసిన ఇంకొక రూపకల్పన ఊరగాయల పరిశ్రమలకే పనికి వచ్చే నిమ్మకాయలు కోసే యంత్రం. ఇది తక్కువ ఖర్చుతో సృజనాత్మకత కూడిన డిజైన్‌తో తయారు చేసిన యంత్రం. ఒకవైపునించి నిమ్మకాయలు పెడుతూ వుంటే మరోవైపునుండి ఒకే ఖచ్చితమైన సైజులో నిమ్మకాయ ముక్కలు వస్తూ వుంటాయి. దీని సహాయంతో ఒక నిమ్మకాయను ఎనిమిది ముక్కలు చేయవచ్చు.

యం.వి.ఐ.ఎఫ్. ఆర్థిక సహాయంతో నాగరాజన్ ఈ యంత్రాల వ్యాపారం చేపట్టాడు. ఇతనికి ఎన్.ఐ.ఎఫ్. మార్కెటింగ్‌లో కూడా సహాయం చేస్తున్నది.

## పాలు పితికే యంత్రం



భారతదేశ గ్రామాలలో పశువులనుండి సురక్షితం గా పాలు పితకటం అనేది చాలా ముఖ్యమైన పని. కర్నాటకకు చెంది 'రాఘవ గౌడ' దీనిని సమర్థవంతంగా చేయటానికి ఒక యంత్రాన్ని రూపొందించాడు. ఈ యంత్రంతో చాలా తక్కువ ఖర్చుతో రైతులు పశువుల నుంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో తక్కువ శ్రమతో పాలు పితకవచ్చు.

దీనిని వాడటం ఎంత సులువు అంటే సామాన్య మహిళలు కూడా దీని ద్వారా ఏ శిక్షణా లేకుండా పని చేయవచ్చు. ఈ యంత్రంలో తక్కువ వాక్యూమ్ శక్తి ద్వారా పాలు పితికే పద్ధతి వుంటుంది కనుక దీనిని ఇతర పనులకు కూడా వాడుకోవచ్చు. ఎన్.ఐ.ఎఫ్. రాఘవ గౌడకు మార్కెటింగ్ సౌకర్యం కలుగజేస్తుంది. దీని కారణంగా ఈ యంత్రం కేవలం భారతదేశంలోనే కాక, ఫిలిప్పయిన్స్, ఉగాండా, ఇతియోపియా లాంటి దేశాలకు కూడా ఎగుమతి చేయటం జరిగింది.



## కలబంద నుండి గుజ్జు తీసే యంత్రం





హర్యానాకు చెందిన 'ధర్మవీర్' మూలికా ఔషధాలకై కలబంద నుండి గుజ్జుని సమర్థవంతంగా తీసి, ఆవిరి పెట్టి చూర్ణం చేయటం లాంటి అనేక ప్రక్రియలకి పనికివచ్చే ఒక యంత్రాన్ని రూపొందించాడు. ఇది చాలా సమర్థవంతమైన యంత్రం, రాష్ట్రపతి నుండి అవార్డును కూడా అందుకుంది.

దీని సహాయంతో అతను ప్రెషర్ కుక్కర్‌లాగా పనిచేసే భాగంలోనుండి కలబంద గుజ్జుని వేరు చేస్తాడు. ఈ యంత్రం చిన్నదిగా వుంటుంది కనుక దీన్ని ఎక్కడికైనా, చివరికి పొలాల్లో కూడా తీసుకు వెళ్ళి మూలికలని శుద్ధి చేసి అవసరమైన ప్రదేశానికి సరఫరా చేయవచ్చు. ఎన్.ఐ.ఎఫ్. సహాయంతో ఇతను దీనిని వ్యాపారాత్మకంగా ఉత్పత్తి చేస్తున్నాడు. దీని పనితీరును పరిశీలించటానికై 'కేన్యా' దేశం ఒక యంత్రాన్ని కొనుగోలు చేసింది. వారికి దీని పనితీరు నచ్చితే ఇంకా



## నీటి పంపుకు సెల్ ఫోన్ స్టార్టర్



గ్రామంలోని రైతు సుఖంగా తను ఇంట్లో కూర్చుని రాత్రైనా, పగలైనా ఎక్కడో దూరంలో వున్న తన పొలంలో నీరు పెట్టడానికి తన సెల్ ఫోన్‌ని వాడ గలిగితే ఎంత బావుంటుంది అన్న ఆలోచనని నిజం చేశాడు హర్యానాకు చెందిన 'ప్రేమ్‌సింగ్ సైనీ'. మొబైల్ టెలిఫోన్‌లతో ఎలక్రికల్ స్విచ్‌లని నియంత్రించటం ద్వారా ఇది సాధ్యపడిందతనికి.



రైతు తన సెల్‌ఫోన్ ద్వారా తన మోటార్ పంపు వివరాలు గ్రహించి, ఒక నిర్ణీత నెంబరు డయల్ చేసి, పంపు స్విచ్‌ను ఆన్ లేదా ఆఫ్ చేయటానికి వీలవుతుంది. సెల్‌ఫోన్ కొన్నిసార్లు మోగగానే పంపు పనిచేయటం లేదా ఆగిపోవటం జరుగుతుంది కనుక ఆ ఫోన్ కాల్‌కి ఖర్చయ్యే సమస్యే లేదు.

## నిదానంగా పారే మురికినీరు/ నీటినుంచి విద్యుత్ ఉత్పత్తి



ప్రపంచవ్యాప్తంగా రకరకాల పద్ధతుల్లో విద్యుత్ ఉత్పత్తి చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్న ఈరోజుల్లో కర్నాటక రాష్ట్రానికి చెందిన కె. బాలకృష్ణ నిదానంగా పారే నీరు లేదా మురికినీటి కాలువ నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను కనుగొన్నాడు.

ఈ పద్ధతిలో పారే నీటిని ఒక గుండ్రని డ్రమ్ములాంటి దానిలోనుంచి ప్రవహింపజేయటం ద్వారా ఇతను సాధించాడు. ఆ డ్రమ్ములో అమర్చిన బ్లేడ్లు తిరగటం ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పుడు అమలులోవున్న ప్రాజెక్టు సామర్థ్యం 30 కె.వి.ఎ. ఈ టెక్నాలజీ తక్కువ వేగం, ఎక్కువ పరిమాణంలో పరిశ్రమ వ్యర్థాలు లేదా మురుగునీటి పారిశుధ్యపు ప్లాంటు ఉన్నచోట ఏర్పాటు చేస్తే చాలా ప్రయోజనకరంగా వుంటుంది. ఎన్.ఐ.ఎఫ్. దేశీయంగా కూడానే కాకుండా అంతర్జాతీయ సంస్థలతో ఈ టెక్నాలజీలో భాగస్వామ్యం గురించి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇన్నోవేటర్ పేరున ఎన్.ఐ.ఎఫ్. ఈ టెక్నాలజీని పేటెంట్ చేయటానికి దరఖాస్తు కూడా చేసింది. ప్రజా సంస్థలు, పురపాలక సంఘాలు దీనిని పరిశీలించటానికి ముందుకు రావలసి వుంది. ఈటెక్నాలజీ అమలులోకి వస్తే విద్యుత్ సంక్షోభం నుండి కొంతయినా బయట పడే అవకాశాలు మెండుగా వున్నాయి.






## వెదురు వ్యర్థాలతో తయారు చేసిన జనరేటర్



గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు ద్వారా నీటిని తోడుకోవటానికి ఎంతో ప్రాముఖ్యతనిస్తారు. నాగాల్యాండ్‌కి చెందిన 'ఇమ్లీతోషినాము' అనే అతను తాను వెదురు వస్తువులు తయారు చేయగా వచ్చిన పొడిలో ఒక రకమైన జిగురు కలిపి ఒక గట్టి పదార్థాన్ని తయారు చేసి దానితో తేలికగా వుండే కరెంటు తయారు చేయటానికి ఉపయోగపడే హైడ్రో టర్బైన్‌ను తయారు చేశాడు. ఇది చాలా తేలికగా ఉండటం చేత సులువుగా తిరుగుతూ ఎక్కడికైనా తీసుకు వెళ్ళటానికి వీలుగా వుంటుంది.











## అభివృద్ధి పర్చిన జలవిద్యుత్ టర్బయిన్





మామూలు ప్రాంతాల్లోనే విద్యుత్ సరఫరా చేయటం కష్టం. అలాంటిది సుదూర కొండ ప్రాంతాల్లో కరెంటు సరఫరా చేయటం ఇంకా కష్టం. దుర్భేద్యంగా వుండే ప్రాంతాల్లో కరెంటు తీగలు వేయటం, వేసినా అవి తరచూ తెగిపోవటం మొదలైన కారణాల వల్ల అటువంటి ప్రాంతాల్లో విద్యుత్ సమస్య చాలా వుంది. కర్నాటకకు చెందిన జి.కె. రత్నాకర్ ఈ సమస్యను పరిష్కరించటానికి ఒక ప్రత్యేకమైన జలవిద్యుత్ టర్బయిన్‌ను తయారు చేశాడు. ఈ జలవిద్యుత్ టర్బయిన్‌లు ప్రత్యేకించి కొండ ప్రాంతంలో వాడటానికే రూపొందించబడ్డాయి. ఒక కుటుంబానికి సరిపడా విద్యుత్ తయారు చేయటానికి ఉపయోగించే టర్బయిన్‌కి సుమారు రూ. 30 వేలు ఖర్చవుతుంది. రత్నాకర్ తయారు చేసిన ఈ టర్బయిన్ ద్వారా కరెంటు ఉత్పత్తి చేయటానికి దీనిని కర్నాటకలోని మారుమూల కొండ ప్రాంతంలో కొన్నింటిని ఏర్పాటు చేశాడు. వీటి సహాయంతో ఆ ప్రాంత ప్రజలకి నిరాటంకంగా విద్యుత్తు లభ్యమవుతోంది.



## బయోమాస్ (కుళ్ళిన ఆకులు, చెత్త)తో గ్యాస్ తయారీ



మనదేశంలో ఇంకా విద్యుత్ సౌకర్యం లేని, వచ్చినా పవర్ కట్‌లతో కటకటలాడే గ్రామాలు అనేకం వున్నాయి. నిరంతరం తరిగిపోతున్న నిల్వలు, రోజురోజుకీ పెరిగిపోతున్న ధరలతో ఏ రకమైన చమురూ దీనికి సమాధానం కాదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో బయోమాస్ దీనికి సరియైన పరిష్కారంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా ఈ బయోమాస్ పరికరం వాడేవారు వాడిన కొంత కాలానికి ఇంజన్ బిగుసుకుపోయి సరిగ్గా పనిచేయటం లేదని ఫిర్యాదు చేస్తూ వుంటారు. రాజస్థాన్‌కు చెందిన 'రాయ్‌సింగ్ దహియా' దీనికొక మార్గాన్ని కనిపెట్టాడు. గ్యాస్ తయారు చేసే పరికరం డిజైన్‌ను కొంత మార్పు చేసి, కొత్తరకం ఫిల్టర్లు, శీతలీకరణ విధానాన్ని ప్రవేశపెట్టి స్వచ్ఛమైన గ్యాసు వచ్చే విధానాన్ని కనిపెట్టారు. వీటితో ఇంజన్ నిరంతరం ఆగిపోకుండా పని చేయటమే కాకుండా, దీనిని నడిపించటానికి చాలా తక్కువ ఖర్చు అవుతుంది. ఇతను తయారు చేసిన పరికరానికి సరాసరి ఒక గంటకి ఒక కిలో బయోమాస్ అవసరమౌతుంది. రాయ్‌సింగ్ దహియా కనిపెట్టిన ఈ యంత్రం పది కిలోవాట్లది అయితే రూ. 1 లక్ష 25 వేలు, 25 కిలోవాట్లది అయితే రూ. 2 లక్షలు, 30 కిలోవాట్లదయితే 3 లక్షలు, 35 కిలోవాట్లదైతే 3 లక్షల 25 వేల రూపాయలు ఖర్చవుతుంది.

'టెరి' ఎనర్జీ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు ఈయన రూపొందించిన విధానాన్ని పరిశీలించి, దీని ప్రత్యేకతను ధృవీకరించారు. ఇప్పటివరకు దీనిని వాడిన 50 మంది వినియోగదారులు చాలా సంతృప్తికరంగా పని చేస్తున్నదని కితాబునిచ్చారు. దహియా ఎన్.ఐ.ఎఫ్. వారి ఎం.వి.ఐ.ఎఫ్. నిధులను అందుకొని సుమారు 50 యూనిట్ల అమ్మకాలు చేశాడు.





# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

**21401 - పశువులు ఎదకు రావటానికి వెల్లుల్లి :**

గుజరాత్‌కులోని చిక్లి తాలూకా, నవసారి గ్రామానికి చెందిన 'బాలూ భాయ్ మంగాభాయ్ పటేల్' పశువులు ఎదకు రావటానికి వెల్లుల్లి వాడటం మంచిది అని



చెపుతున్నాడు. ఈయన 250 గ్రా. వెల్లుల్లిని పశువుల దాణాలో కలిపి తినిపిస్తే పదిహేను రోజుల్లో అవి ఎదకు వస్తాయని చెబుతున్నారు.

**21402- ఎక్కువ పాల దిగుబడికై చిట్కా:**



గుజరాత్‌కు చెందిన చిక్లి తాలూకా, నవసారి గ్రామానికి చెందిన 'జాషుబెన్ దయాభాయ్ పటేల్' పశువులలో అధిక పాల దిగుబడికై ఈ చిట్కా మందు ఉపయోగిస్తున్నది. పశువులకి స్థానికంగా 'కొడిశెపాల' అని పిలువబడే చెట్టు గింజలు, ఆకులని సుబాబుల్ ఆకులతో కలిపి తినిపిస్తే వాటిలో పాల దిగుబడి చెప్పుకోదగినంతగా పెరుగుతుందని అంటున్నారు.

**21403- పశువులలో పారు వ్యాధి నివారణకై చిట్కాలు :**


గుజరాత్‌లోని నవసారి గ్రామంకు చెందిన 'జయశ్రీ బెహెన్, జగదీష్ భాయ్ పటేల్'లు పశువులలో పారు వ్యాధిని మారేడు చెట్టు వేర్ల రసంతో నివారించవచ్చు అంటున్నారు.

అదే ప్రాంతానికి చెందిన 'హార్థిక్ భాయ్ గోవింద్ భాయ్ పటేల్' లేత వెదురు చెట్టు ఆకుల రసాన్ని నీటితో కలిపి పశువులకి తాపితే కూడా పారు వ్యాధిని నివారించవచ్చు అంటున్నారు.

అదేవిధంగా 'కానూభాయ్ మఖన్‌భాయ్ పటేల్' దానిమ్మ రసం పశువులకి తాపినా కూడా ఈ వ్యాధిని నివారించవచ్చు అంటున్నారు.

**21404- గాలికుంటు వ్యాధికి చిట్కా :**

గుజరాత్‌లోని రమన్‌భాయ్ భవ్‌భాయ్ పటేల్ పశువులలో గాలి కుంటు వ్యాధి నివారణకి 'ఉమ్మెత్త' చెట్టు లేత ఆకులను కర్పూరంతో కలిపి పశువుల గిట్టల దగ్గర పట్టిస్తే గిట్టలలో గల పురుగులు నశిస్తాయి. ఈ చిట్కాను ఆయన గత అనేక సంవత్సరాలుగా వాడుతూ పశువులకు ఊరట కలిగిస్తున్నాడు.



**21405- పశువుల కడుపులో నట్టలు పడినప్పుడు :**

గుజరాత్‌లోని కదన గ్రామానికి చెందిన గాలాభాయ్ కేస్‌రాభాయ్ పండోరా పశువుల కడుపులో




నట్టలు పడినప్పుడు వాటికి టేకుచెట్టు బెరడు రసాన్ని రోజుకొకసారి మూడు రోజులపాటు పశువులకు తాపితే నట్టలు పడిపోతాయని అంటున్నారు.

అదేవిధంగా పద్మాబెన్ నరోత్తమ్‌భాయ్ పటేల్ పశువులకు కడుపునొప్పి మరియు విరోచనం సాఫీగా కానపుడు పాత చింతపండు గుజ్జు నీటిలో మరిగించి, దాంట్లో కొంచెం బెల్లం, ఉప్పు కలిపి పశువుకు తాపితే ఉపశమనం కలుగుతుందని, కడుపు ఉబ్బరం తగ్గుతుందని అంటున్నారు.

**21406- పశువుల కొమ్ములు విరిగినప్పుడు :**

గుజరాత్‌లోని కదన పంచమహల్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌భాయ్ కాలూభాయ్ పండోర్ పశువులకి కొమ్ములు విరిగినప్పుడు అయిన గాయాలను నయం



చేయటానికి 'తిమిరం' చెట్టు గుజ్జును బొగ్గుపొడితో కలిపి గాయంపై రాస్తే అది రక్తస్రావాన్ని ఆపటమే కాకుండా గాయాన్ని నయం చేస్తుంది అంటారు.

**21407- మామిడి ఆకులను తినే పురుగు నివారణకు :**

గుజరాత్‌లోని చిక్లి గ్రామానికి చెందిన రమణ్‌భాయ్ భవ్‌భాయ్ పటేల్ మామిడి చెట్టు ఆకులను పురుగులు తినేస్తూ వుంటే అడ్డసరం (వాసా) ఆకుల రసం 100 మి.లీ., ఆముదం 100 మి.లీ.ను 15 లీటర్ల నీటిలో కలిపి చెట్టుకు పిచికారి చేసి నివారించవచ్చు అంటున్నారు. ఒక్కసారి పిచికారి చేస్తే 7 రోజుల వరకు చెట్టుకు రక్షణనిస్తుందని అంటున్నారు. పురుగు నివారణ కాకపోతే మరోసారి పిచికారి చేస్తే సరిపోతుంది అంటున్నారు.

**21408- వేరుశనగకి మూలికా వైద్యం :**

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రియాభాత్రా వేరుశనగ చెట్లకి చీడ పట్టినప్పుడు 250 గ్రా. తురకవేప చెట్టు లేత కొమ్మలను బాగా దంచి ముద్దగా చేసి 5 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేస్తే చీడ నివారించబడుతుంది. ఇలా నెలకు రెండు



లేదా మూడుసార్లు చేస్తే చీడ నివారించబడటంతో పాటు పంట ఏపుగా పెరిగి దిగుబడి కూడా పెరుగుతుంది అంటున్నారు. ఈ పద్ధతిని తాను గత పది సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నానని, మంచి ఫలితాలను కూడా పొందుతున్నానని ప్రియాభాత్రా తెలియజేస్తున్నారు.

**21409- పశువుల 'మావి' త్వరగా పడటానికి చిట్కా :**

ఒరిస్సాలోని గజపతి జిల్లాకు చెందిన 'అఖిలా పరీచ్ఛ' పశువులలో మావి త్వరగా పడటానికి ఈ చిట్కాను ఉపయోగిస్తున్నారు. 200 గ్రా. ఆముదం ఆకులను



పశువులకు తినిపిస్తే అరగంటలో ఫలితం వుంటుంది. ఆమె ఈ విధంగా ఎన్నో పశువులకు వైద్యం చేసింది.

**21410- పశువుల గాయాలకు మందు:**

ఒరిస్సా రాష్ట్రంలోని సుందర్‌ఘర్ జిల్లాలోని తంకదార్ కిషన్ పశువులకు గాయాలై పురుగులు పట్టినప్పుడు తెల్లజిల్లేడు పాలను గాయంపై పూస్తే అది గాయాన్ని ఎక్కువ చేసే పురుగులను నివారించటమే కాక, గాయాన్ని త్వరగా మానేలా చేస్తుంది అంటున్నారు. తానీ పద్ధతిలో అనేక పశువులకి వైద్యం చేశానని అంటున్నారు.



**21411- ఎద్దులలో వీర్యం అభివృద్ధి చెందటానికి :**

తమిళనాడు తారాపురం జిల్లాలో 5వ తరగతి చదివే సుందరం తన తల్లి ఫలని అమ్మళ్‌తో నివసిస్తోంది. వారికి తొమ్మిది ఎకరాల పోరంబోకు భూమి, ఐదు ఎకరాల తోట ఉన్నాయి. వారికి ప్రస్తుతం బ్రీడింగ్ బుల్స్ (విత్తనం ఎత్తులు) నాలుగు ఉన్నాయి. వాటితోపాటు 45 గొర్రెలు కూడా ఉన్నాయి. ఈ అమ్మాయి పశువులలో వీర్యోత్పత్తికి ఈ చిట్కా బాగా ఉపయోగపడుతుందని తెలియజేస్తోంది.

రెండు కిలోల పత్తి విత్తనాలు, 23 కిలోల బియ్యము, 5 గంటలపాటు నానబెట్టి కొబ్బరిని తురుము పట్టి వాటితో పాటు తన నాలుగు ఎద్దులకు సమానంగా తినిపిస్తుంది. ఇంతే కాక, అరకిలో గానుగ చెక్కను నీటిలో నానబెట్టి ఆ నీటిని వాటికి తాగిస్తుంది. ఇలా చేయటం వల్ల పశువులు ఏపుగా ఆరోగ్యంగా పెరగటంతో పాటు వాటి వీర్యాభివృద్ధి కూడా జరుగుతుంది.


**21413- పశువలకి ఎండసొర సోకినప్పుడు :**

తమిళనాడుకు చెందిన సుందరం రామస్వామి పశువులకి ఎండసొర కొట్టి నీళ్ళు త్రాగనప్పుడు వాటికి చేదు దోసకాయ పాదు వేరుని గుజ్జు చేసి దాన్ని తినిపిస్తే మంచి ఫలితం వుంటుంది. ఇది పశువులలో, గొర్రెలలో రక్త విరోచనాలను కూడా నివారిస్తుంది అంటున్నారు.

**21414- పశువుల ప్రేవుల్లో నులి పురుగుల నివారించి, చూలుకు రావటానికి :**

తమిళనాడుకు చెందిన 7వ తరగతి వరకు చదువుకున్న 50 సంవత్సరాల నటరాజన్‌కు 10 ఎకరాల తోట, బంజరు ఉన్నాయి. ఆయన పశువుల పెంపకంలో అపారమైన అనుభవం వున్న తన తండ్రివద్ద నుండి కొన్ని వైద్య చిట్కాలను నేర్చుకుని ఇప్పటికీ పాటిస్తున్నాడు. ఆయన పశువుల ప్రేవులలో నులి పురుగులు నివారిస్తే అవి చూలుకు సిద్ధమౌతాయని, దానికి 200 మి.లీ. వేప నూనె, 4 లేదా 5 నిమ్మకాయలు పశువుకి తినిపించాలని, అదేవిధంగా ఈ రోగం వచ్చిన పశువుకు ఖాళీ కడుపుకు ప్రతిరోజూ ఉదయం పూట మూడు రోజులపాటు కలబంద తినిపిస్తే అవి త్వరగా కట్టకానికి వచ్చి చూలుకు సిద్ధమౌతాయని అంటున్నారు.

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. 2010లో శ్రీ శ్రీకర్ గారి ఆగమనంతో ప్రభుత్వ సంస్థలతో హనీబీఏపి అనుసంధానం ఇంకా బాగా పుంజుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాం క్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

✤ 86 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ ఇప్పటి వరకు 18 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ గత నాలుగేళ్లలో 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించటం, ఆరవ సంవత్సరం నుండి దీన్ని ద్వైమాసిక పత్రికగా మార్చటం.

✤ 1 మార్చి, 2010న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్నోవేటర్లు, అధికారులు, అనధికారుల సమ్మేళనం అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడం.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.

✤ కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు నల్లమల అడవులలోని మొక్కలతో చేసిన ప్రయోగాలు అద్భుత ఫలితాలు సాధించాయి. వీటివల్ల మనుషులకు, పశువులకు, పంటలకు ఎంతో లాభం చేకూరింది. ఈ అద్భుత లక్షణాలుగల మొక్కలను పరీక్షించటానికి హనీబీఏపి "సి.సి.ఎం.బి., హైదరాబాద్"తో ఆగస్టు 2010లో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పరిశోధనా సంస్థలకు, పల్లె జ్ఞానానికి ఇదొక వినూత్న సంధానం.

✤ ఫోర్బ్స్ పత్రిక చింతకింది మల్లేశానికి అంతర్జాతీయ గుర్తింపుగా భారతదేశంలో అతి శక్తిశాలురైన ఏడుగురు గ్రామీణ ఇన్నోవేటర్లలో ఒకరిగా ఎన్నుకుంది.

✤ మే 25, 2011న నాబార్డు సంస్థలో తొమ్మిది మంది ఇన్నోవేటర్లు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని నాబార్డు సంస్థ, హనీబీఏపిల పరస్పర ప్రయత్నంతో జరిగింది. ఆర్థిక సహాయంతో ఈ ఇన్నోవేషన్లను సామాజికాభివృద్ధికై మార్కెట్ చేయాలని నాబార్డు సంస్థ నిర్ణయించింది.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

✤ 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో-ఆర్డినేటర్, హనీబీఏపి, ఫోన్ : 98660 01678.

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్
# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

**శిశు మైత్రీ ఆసుపత్రులు**

**పాఠకులకు నమస్సులు....**

❀ ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.

ఆసుపత్రులలో కాన్పు అయ్యే తల్లులు ఎక్కువగా పోతపాలు పట్టుట, ఇంటి దగ్గర కాన్పు అయ్యే తల్లులు ఎక్కువగా తల్లిపాలు పట్టుట ఇటీవల గమనించిన భయంకర సత్యం.

- ఆసుపత్రుల ఆలోచనల్లో మార్పు తెచ్చుటకు 1991లో టర్కీలోని అంకారాలో శిశుమైత్రీ ఆసుపత్రుల ఉద్యమం ప్రపంచ ఆరోగ్య సంస్థ – యూనిసెఫ్ – ప్రకటించాయి.
- తల్లిపాల సంస్కృతి పునరుద్ధరణకు శిశుమైత్రీ ఆసుపత్రులు 10 అంశాలు అమలు చేస్తాయి.

1. తల్లి పాలను ప్రోత్సహించే లిఖిత ప్రణాళిక తయారు చేసుకుంటాయి.
2. ఈ ప్రణాళిక అమలుకు ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇస్తాయి.
3. గర్భవతులకు తల్లిపాల ఆవశ్యకత గురించి తెలియజేస్తాయి.
4. శిశువు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టుటకు ప్రోత్సహిస్తాయి.
5. తల్లులు పిల్లలకు పాలు పట్టే విధానం, శిశువు దూరంగా ఉన్నా పాల ఉత్పత్తి రక్షణ గురించి అవగాహన కలిగిస్తాయి.
6. అప్పుడే పుట్టిన శిశువులకు ప్రత్యేకంగా అవసరమైతే తప్ప తల్లిపాలు మినహా మరేమి ఇవ్వకు,డా చూస్తాయి.
7. రోజంతా (24 గంటలు) తల్లులు – బిడ్డలు కలిసి ఉండేలా చేస్తాయి.
8. శిశువులకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు తల్లిపాలు పట్టాలని చెపుతాయి. పాలు పట్టడంలో కాలపట్టికలు నిరుత్సాహపరుస్తాయి.
9. పాల సీసాలు – పాల పీకలు వాడకుండా చూస్తాయి.
10. తల్లిపాలు ప్రోత్సహించే తల్లులు సమూహాలు ఏర్పరచి, వారి ద్వారా తల్లిపాల రక్షణకు కృషి చేస్తాయి.

- మన రాష్ట్రంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి చిత్తూరు మొదటి శిశు మైత్రీ ఆసుపత్రి. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ ఆసుపత్రి మొదటి శిశుమైత్రీ ఆసుపత్రిగా గుర్తింపు పొందింది.

**ప్రవైద్యరంగంలో మహానుభావులు - 1**

**(సర్ విలియం ఓస్లర్)**

❀ సర్ విలియం ఓస్లర్ ప్రముఖ కెనడా వైద్యుడు. అమెరికాలోని జాన్స్ హాప్ కిన్స్ వైద్యపాఠశాల ఆసుపత్రి వ్యవస్థాపకులలో ఒకరు.

- సర్ విలియం ఓస్లర్ 12–7–1849న జన్మించారు. 29–12–1919న మరణించారు.
- ఓస్లర్ గొప్ప వైద్యుడు, గొప్ప ఉపాధ్యాయుడు మరియు గొప్ప మానవతావాది.
- ఓస్లర్ చెప్పిన ఎన్నో అంశాలు మన జీవితాలకు ఉపయోగపడతాయి. కొన్నిట్ని గురించి తెలుసుకుందాం

1. మనుషుల్లో మందులు తినాలనే కోర్కె ఎక్కువ. జంతువులలో ఈ కోర్కె ఉండదు. ఇదే మనుషులకు జంతువులకు తేడా!
2. పుస్తకాలు లేకుండా వైద్యవిద్య చదివే వారు సముద్రం గురించి ఏమీ తెలియకుండా సముద్రయానం చేసినవారి మాదిరే. రోగులు లేకుండా వైద్యవిద్య చదివేవారు అసలు సముద్రం దగ్గరికే పోనివారు.

3. రోగిలో ఎలాంటి వ్యాధి ఉందో తెలుసుకోవడం కంటే, వ్యాధి ఎలాంటి రోగిలో ఉందో తెలుసుకోవడం ముఖ్యం.

4. చదవడంకంటే పుస్తకాలు కొనడం ఎంతో సులభం. చదివినది ఆకలింపు చేసుకోవడంకంటే చదవడం సులభం.

5. వైద్యశాస్త్రం "ఏదో తెలియనిది" మరియు "ఇది కావచ్చు" అనే శాస్త్రం.

6. "జనాన్ని మందులు తీసుకోవద్దు" అని చెప్పడం డాక్టరు ప్రధానమైన పని.

7. సబ్బు, నీరు మరియు ఇంగిత జ్ఞానం సూక్ష్మజీవుల నుండి రక్షించే ఉత్తమ సాధనాలు.

8. మంచి డాక్టర్లు వ్యాధికి వైద్యం చేస్తారు. గొప్ప డాక్టర్లు రోగికి వైద్యం చేస్తారు.

## ప్రవైద్యరంగంలో మహానుభావులు - 2

## (రిచర్డ్ ఏచెర్)

❀ రిచర్డ్ ఏచెర్ ప్రముఖ బ్రిటీష్ డాక్టరు. వినాళ గ్రంథుల వ్యాధులలో మరియు రక్త సంబంధిత వ్యాధులలో నిపుణుడు.

- 3-4-1912 జన్మించి, 25-4-1969న మరణించారు
- ఆయన కాలంలో ఉన్న వైద్య పద్ధతుల గురించి ఆయన తీవ్ర ఆందోళన చెందేవారు. ఎన్నో పుస్తకాలు మరెన్నో వ్యాసాలు రాశారు.
- రిచర్డ్ ఏచెర్ లండన్‌లోని మిడిల్ సెక్స్ ఆసుపత్రిలో ఎక్కువ కాలం పనిచేశారు.
- ఆనాటి వైద్యపత్రికలు చాలా నిరుత్సాహంగా ఉన్నాయని పదే పదే చెప్పేవాడట.
- ఆయన రాసిన "వైద్యంలో సప్త మహాపాపములు" అనే వ్యాసం ప్రముఖ వైద్యపత్రిక లాన్సెట్‌లో 7-8-1949న ప్రచురించడమైంది. సప్త మహా పాపములు ఇవి.

1. డాక్టర్లు రోగులకు అర్థమయ్యే లాగా మాట్లాడకుండుట.
2. డాక్టర్లు రోగులను చులకనగా చూడటం.
3. మాటల్లో, నడవడికలో డాక్టర్లకు మర్యాద లేకుండుట.
4. పెద్ద నిపుణులే కావాలనుకోవడం - ఒకవేళ అది సహజమైనా, చిన్న చిన్న సమస్యలను వినకపోవడం.
5. తమ విభాగం (స్పెషాలిటీ) గొప్ప, మిగతావి తక్కువ అనుకోవడం.
6. వైద్యులు నైపుణ్యాన్ని పెంచుకోకపోవడం.
7. రోగులను అర్థం చేసుకోకపోవడం. బాగా పరీక్ష చేయకుండా ఎక్కువగా లాబరేటరీ పరీక్షలు చేయించడం

## పిల్లలు ఎందుకు ఏడుస్తారు?

❀ బాగా మాటలు వచ్చే వరకు ఏడుపే పిల్లల భాష.

- 90 శాతం పిల్లల ఏడుపుకు కారణం రోగాలు కాదు. కాబట్టి మందులు అవసరం లేదు.
- పిల్లలు ఆకలయితే ఏడుస్తారు ఆకలి తీర్చండి.
- పక్కతడిస్తేత ఏడుస్తారు. ఒళ్ళు తుడిచి, పొడి బట్టలు వేయండి.
- వేసవిలో బిగుతుగా బట్టలు వేసినా, చలిలో వదులుగా వేసినా ఏడుస్తారు.
- కొందరు పిల్లలు ఎక్కువ వెలుగుంటే ఏడుస్తారు. కొందరు చీకటిని భరించలేక ఏడుస్తారు.
- నిద్రవస్తుంటే కూడా పిల్లలు ఏడుస్తారు.
- జలుబు చేస్తే పిల్లలు, ఊపిరి తీసుకోలేక ఏడుస్తారు.
- అమ్మ కనిపించకపోతే పిల్లలు ఏడుస్తారు.
- ఇంటినుండి బయటకు తీసుకుపొమ్మని తెలిపేందుకు పిల్లలు ఏడుస్తారు.
- పిల్లలలో ఏడుపుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. మందులలో పరిష్కారం వీలున్నంత వరకు వెదుక్కోకండి. ఏడుపును సాధారణ చర్యలతో పరిష్కరించుకోలేకపోతే డాక్టరు సలహా పొందండి.

ఈ అంశాలు ఒక నోటుపుస్తకంలో రాసిపెట్టండి, మీ స్నేసితులతో, బంధువులతో, సహచరులతో మాట్లాడండి. వారికి పోస్టుకార్డులపై రాసి తెలపండి.

**- సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ..**

**ఓపియస్‌డిహెచ్.**

# స్పందన

ఎడిటర్ గార్కి, నమస్కారములు,

'పల్లెసృజన' మే–జూన్– 2011 సంచిక చదివాను చాలా బాగుంది. 'ఆవిష్కరణలు' గురించి సామాన్యులకు తెలియజేసే మొదటి మాసపత్రిక ఇదే అనుకుంటున్నాను. మీ కృషికి అభినందనలు. 'పల్లెసృజన' ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉన్నది. ఇందులో కేవలం 10 పేజీలు మాత్రమే ఆసక్తిగా ఉన్నాయి. మిగతా విషయాలు బోరు కొడ్తున్నాయి. 'ఇన్నోవేషన్ల' గురించి ఇంకా ఎక్కువ సమాచారం అందించవలసి ఉన్నది. **– పి. ఖాశిం పీరాన్,** అనంతపురం.

**పీరాన్ గారూ ధన్యవాదములు,**

మీ అభినందనలను, సద్విమర్శలను ఆనందంగా స్వీకరిస్తున్నాము. ముమ్ముందు 'పల్లెసృజన' పత్రిక ఇంకా ఆసక్తికరంగా వుండేలా కృషి చేస్తామని తెలియజేస్తున్నాము. **– ఎడిటర్.**

## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/64, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.
Date 28-4-2011

Signature of Publisher

National Innovation Foundation

# దేశంలోని అన్ని భాషల్లో దృశ్య శ్రవణ పద్ధతి ద్వారా ఇన్నోవేషన్లకు ప్రచారం - వాటిని ప్రజలకు ఉపయోగపడేలా చూడటం




Honey Bee Network   SRISTI   DST   GIAN

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 20/-లు మాత్రమే**










**ఒక పుస్తకం వెల రూ. 10/-లు మాత్రమే**

పల్లెసృజన

పదిమందికి పనికివచ్చే

# పల్లెజ్ఞానం

హనీబీఏపి సేకరించిన మన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాలను ఒక పాకెట్ పుస్తకం లో పొందుపరచడమైనది. ఈ పుస్తకం కావలసిన వారు ఒక్కో పుస్తకానికి రూ. 10/-ల చొప్పున పంపి కావలసినన్ని పుస్తకాలను పొందగలరు.

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 1,500/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 2,500/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 3,750/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 6,500/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com **www.pallesrujana.org**

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.
M/s Aruna Ganesham, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
A/c No. 905 520 100 773 62

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655